జనరాజకీయం కోసం ...

₹ 10

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి 2 సంచిక - 10 మే16-31, 2011

పక్షపత్రిక



## యథాస్థితినీ, అవినీతినీ తిరస్కరించిన ఓటర్లు



మరో ఛాన్స్....

## కొత్తచూపుతో రైతుల ఉద్యమం







# ఉభయ గోదావరి జిల్లాల్లో జేపీ రైతు ఉద్యమ యాత్ర











గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో రైతుల అవగాహన సదస్సు

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక మే16-31, 2011

సంపుటి - 2 సంచిక - 10

## లోపలి పేజీల్లో...

యధాస్థితిని తిరస్కరించిన ఓటర్లు................ 5

విద్యుత్ రంగంపై జేపీ.............................. 9

ఎంపీ లాడ్స్ అభివృద్ధికా, అవినీతికా?............. 14

భారత్ - చైనా జీవన వ్యత్యాసాలు................ 17

బియ్యం ఎగుమతికి ఇంకెప్పుడు అనుమతి ....... 21

స్వతంత్ర రైతు ఉద్యమానికి సౌరధ్య సంఘం...... 23

గోదావరి జిల్లాల్లో జేపీ రైతు ఉద్యమ యాత్ర...... 26

యూత్‌ఫోరం........................................ 28

మెదక్ జిల్లా లేఖ.................................... 30

మున్సిపల్ ఎన్నికలు.................................. 32

జిల్లాల సమాచారం................................. 33

## సంపాదకవర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**
సంపాదకులు

సంపాదక వర్గం
జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : **సునీత ఆరిమిల్లి**
డి.టి.పి : **జ్యోతి తాటి**
ఫొటోలు : **ఎన్. సంజీవ్ కుమార్**

# రైతులకు కొత్త చూపు

## స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య

### సంపాదకీయం

రైతులకు ఇప్పుడు పంటల సీజను. పంట ధరల మీద ఆశలు పెట్టుకునే సమయం. మరోపక్క సంప్రదాయ రాజకీయ పార్టీలకు ఇది రైతు ఉద్యమాల సీజను. ఒకరి మీద మరొకరు పోటీపడి నిరసన కార్యక్రమాలను హోరెత్తిస్తున్నారు. ఈ తంతు నాటిది కాదు. ఏళ్ళ తరబడి సాగుతున్నది. అయినా రైతులకి వ్యవసాయం లాభసాటి కావడం లేదు. కౌలు రైతులకి కూలిగిట్టడం లేదు. ఈనాటి ప్రతిపక్షం రేపు అధికార పక్షం అవుతున్నది. నిన్నటి అధికారపక్షం రేపు ప్రతిపక్షం అవుతున్నది. మళ్ళీ ఎవరిపాత్ర వారు పోషిస్తున్నారు. అంతా రైతుల కోసం ఘోషించేవారే గాని పరిష్కారాల ధ్యాస కనిపించడం లేదు.

మనకి రైతుల ఉద్యమం లేదు. రైతుల కోసం పార్టీలు సాగించే ఉద్యమాలు వున్నాయి. పార్టీల కార్యకర్తల ఉద్యమాలున్నాయి. ఇందులో రాజకీయం మిన్న రైతుల ప్రయోజనాలు సున్న. ఈ ఉద్యమాలు రైతుల్ని సమీకరించకపోగా వారిలో నిరాశనీ, నిస్సహాయతనీ పెంచాయి.

గత సంవత్సరం డా॥ జయప్రకాష్ నారాయణ్ రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించారు. గ్రామాలను సందర్శించారు. రైతులతో ఇష్టాగోష్ఠి కార్యక్రమాలు నిర్వహించారు. రైతుల అనైక్యతే వారి పాలిటశాపంగా ఎలా మారిందో వివరించారు. వ్యవసాయాన్ని లాభసాటి చేసే కొత్త ఆలోచన చెయ్యాలని సూచించారు. రైతులకు రక్షణ పేరుతో అమ్ముకునే స్వేచ్ఛను ప్రభుత్వాలు హరించిన తీరును వారికి వివరించారు ఈ పర్యటనల అనంతరం రైతులలో కొంత స్పందన మొదలైంది. దానికి సంస్థాగత రూపం ఇచ్చారు. రాష్ట్రంలో స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్యను ఏర్పాటు చేశారు.

మొదటిది ఈ ఉద్యమం గిట్టుబాటు ధర నినాదాన్ని పక్కన పెట్టింది. లాభసాటి ధరల ఉద్యమానికి నాంది పలికింది. రైతులకు రక్షణల పేరుతో విధించిన సంకెళ్లను తెంచే ఉద్యమంగా రూపాంతరం చెందుతున్నది. పారిశ్రామిక వస్తువుల లాగే రైతులు కూడా పంటమాది ఎక్కడైనా అమ్ముకుంటాం అన్నది వారి నినాదం అయింది. ఆహారపంటల ఎగుమతి, దిగుమతి విధానాలను రైతులకు అనుకూలంగా మార్చాలన్నది డిమాండ్ అయింది. ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దత్తు ధరలోని డొల్లతనాన్ని ఈ ఉద్యమం ఎండగట్టింది. కనీస మద్దతు ధరనే ప్రభుత్వ లెవీ ధరగా చేసి ఆహార పంటల ధరలను ప్రభుత్వమే పడగొడుతున్న వైనాన్ని వెలికితీసింది. ఇతర అన్ని పంటలకు లాభసాటి ధరలకు నిర్దిష్ట పరిష్కారాలను ప్రకటిస్తున్నది.

రెండవది, పంటలు వేరైనా రైతులంతా ఒక్కటే అంటూ, రాజకీయాలు వేరైనా రైతు వేదిక ఒక్కటే అంటూ, రైతుల్ని సంఘటితం చేస్తున్నది. సంప్రదాయ పార్టీలు రైతుల్ని చీలికలు పేలికలు చేస్తుంటే ఇది ఐక్యపరిచే వేదికగా ముందుకొచ్చింది.

లాభసాటి వ్యవసాయం కోసం, ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛ కోసం రైతులు సాగించే కొత్త ఉద్యమం కొత్త నినాదాలు, కొత్త గొంతు రాష్ట్రంలో వినిపిస్తున్నది. ఈ సమాఖ్య రైతులకు కొత్త చూపునిచ్చింది. ఇది రైతుల మహోద్యమం కావాలి. – అదే లాభసాటి వ్యవసాయానికి రహదారి అవుతుంది. ■




Indianink సౌజన్యంతో...

# కార్టూన్ కార్నర్




## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
*ఇం.నం. 5-10-180/ఎ&ఎ1,*
*బ్యాంద్ లేన్స్, హిల్‌ఫోర్ట్ రోడ్,*
*హైదరాబాద్ - 500 004,*
*ఫోన్: 040-2323 1818*
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: 040-2323 1818.

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజి | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# ఐదు అసెంబ్లీలకు ఎన్నికలు
# యథాస్థితినీ, అవినీతినీ తిరస్కరించిన ఓటర్లు

**- డి.వి.వి.యస్ వర్మ**

నాలుగు రాష్ట్ర శాసన సభలకీ, ఒక కేంద్రపాలిత రాష్ట్ర శాసనసభకీ ఎన్నికలు జరిగాయి. స్థూలంగా ఊహించిన రీతిలోనే ఫలితాలు వచ్చాయి. ఒక్క అసోంలోనే తరుణ్‌గోగోయ్ ప్రభుత్వం వరుసగా మూడోసారి గెలుపు సాధించింది. మిగిలిన నాలుగు రాష్ట్రాలలోనూ అధికారంలో వున్న పార్టీలు, కూటములు ఓడిపోయాయి. బెంగాల్‌లో, తమిళనాడులలో ప్రభుత్వ వ్యతిరేక పవనాలు బలంగా వీచాయి. అదే దారిలో పాండిచ్చేరి కూడా సాగింది. కేరళలో మాత్రమే ప్రభుత్వ వ్యతిరేకత తక్కువస్థాయిలో కనిపించింది. అయినా ప్రభుత్వం మాత్రం మారింది. స్థూలంగా ఓటర్ల మనోగతాన్ని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకటి ఎదుగుబొదుగు లేని యథాస్థితి కొనసాగింపునీ, అవినీతి పాలననీ, కుటుంబపాలననీ ఓటర్లు తిరస్కరిస్తున్నారు. రెండవది కేవలం ప్రభుత్వ వ్యతిరేకతను గుడ్డిగా ప్రదర్శించకపోగా స్థిరమైన అభివృద్ధికి కాస్త మంచిపాలన ఇచ్చేవారిని ప్రజలు ఆదరిస్తున్నారు. గతంలో నితీష్‌కుమార్‌కి, మోడీకి, షీలాదీక్షిత్‌లకు ప్రజలు ఇలాంటి తీర్పునే ఇచ్చారు. ఇప్పుడు తరుణ్‌గోగోయ్‌కి అలాంటి తీర్పునే ఇచ్చారు. ఇది మన ప్రజల రాజకీయ పరిణతిని సూచిస్తున్నది. మూడోది అధికారంలో వున్న పార్టీల మీద ఇచ్చిన తీర్పు కేవలం వ్యతిరేకతతో ఇచ్చిన తీర్పుగానే భావించాలి తప్ప గెలిచిన ప్రతిపక్షానికి అనుకూలమైనదిగా భావించడానికి వీలులేదు. ఎందుకంటే అధికారంలో వున్న వారిని ఓడించడానికి ప్రతిపక్షాలు కేవలం ఒక సాధనమే గాని ఒక ప్రత్యామ్నాయంగా ప్రజలు చూడడం లేదు. అలాంటి కొత్త తరహా ప్రత్యామ్నాయాలు ప్రజలకు అందుబాటులో కూడా లేవు.

ఈ శాసనసభల ఎన్నికల నుండి రాజకీయపక్షాలు తగిన గుణపాఠాలు తీసుకోవాలి. గెలిచినవాళ్ళంతా గొప్ప, ఓడిన వాళ్ళంతా చెడ్డ అనుకుంటే ప్రయోజనం వుండదు. ఇప్పుడు గెలిచిన వాళ్లు మంచిపాలన ఇవ్వకపోతే వాళ్ళ మనుగడ అయిదేళ్లతో ముగిసిపోతుందని గుర్తుంచుకోవాలి. డబ్బు, ప్రలోభాలు, జనరంజక ఉచితాలతో ఓటర్లు లొంగిపోరని గుర్తుంచుకోవాలి. కేవలం అధికారం కోసమే కూటములు అన్న నినాదాన్ని వదులుకోవాలి. అవినీతి లేని పాలన, నిజమైన ఆర్థికాభివృద్ధి, పాలనలో వికేంద్రీకరణ, అంతిమంగా మానవాభివృద్ధి సాధించే వినూత్న ప్రయత్నాలు తమ రాజకీయ భవిష్యత్తును సుస్థిరపరుస్తున్నాయని, ఈ ఎన్నికల ఫలితాలు దానిని వ్యక్తం చేస్తున్నాయని పార్టీలు గ్రహిస్తే ఆ పార్టీలకు, దేశానికి, ప్రజలకు మేలు జరుగుతుంది.



**తరుణ్ గొగోయ్**

**అసోం (126) ఎన్నికల ఫలితాలు**

| | 2011 | 2006 | +/- |
|---|---|---|---|
| కాంగ్రెస్ | 78 | 53 | +25 |
| ఏజీపీ | 10 | 24 | -14 |
| బీజేపీ | 5 | 10 | -5 |
| ఏయుడీఎఫ్ | 18 | 10 | +8 |
| బీపీఎఫ్ | 12 | --- | +12 |
| ఇతరులు | 3 | 29 | -26 |

**యు.పి.ఎ.కు మిశ్రమ ఫలితాలు**

2009 పార్లమెంటు ఎన్నికలతో పోల్చినప్పుడు ఈ రాష్ట్రాలలో కాంగ్రెస్ దాని భాగస్వామ్య పార్టీలకు గట్టి

ఎదురుదెబ్బతగులుతుందని చాలామంది భావించారు. అవినీతి కుంభకోణాలపై ప్రజాగ్రహం దాని విజయాలను దెబ్బతీస్తుందని ఊహించారు. కాని జాతీయ రాజకీయాల మీద కంటే రాష్ట్రాల పరిస్థితుల మీదే ఈ ఎన్నికలు తీర్పు నిచ్చినట్టు కనిపిస్తున్నది. అసోంలో కాంగ్రెస్ తన బలాన్ని పెంచుకోగా, బెంగాల్‌లో మిత్రపక్షంతో మరింత ముందుకుసాగింది. కేరళలో గత పార్లమెంటు ఎన్నికల ఊపు కొంత తగ్గింది. ఇక తమిళనాడులో, పాండిచ్చేరిలో మిత్రపక్షంగా వున్న డి.యం.కె.తో పాటు అదీ ఓటమి పాలైంది.

జాతీయ స్థాయిలో పరిస్థితులు తనకు అనుకూలంగా మారుతున్నాయని భావిస్తున్న బి.జె.పి.కి ఈ అసెంబ్లీ ఎన్నికలు చేదు అనుభావాలనే మిగిల్చాయి. ఈ ఎన్నికలలో బాగా నష్టపోయినవి వామపక్షాలు. అది బెంగాల్‌లో గత పార్లమెంటు ఎన్నికల కంటే బాగా బలహీనపడింది. కేరళలో నామమాత్రంగా పుంజుకున్నా అధికారాన్ని కోల్పోయింది. ఈ పరిస్థితులలో జాతీయ స్థాయిలో మూడోఫ్రంటు గురించి వామపక్షాలు దాని మిత్రులు అడపాదడపా చేసే ప్రయత్నాలకు విఘాతం కలిగింది. జాతీయ రాజకీయాలలో వామపక్షాల ప్రభ కొడిగట్టింది.



మమతాబెనర్జీ

### బెంగాల్‌లో పగ సాధింపా? ప్రగతా?

పశ్చిమ బెంగాల్ ప్రజలు 34 ఏళ్ళ వామపక్షకూటమి ప్రభుత్వానికి చరమగీతం పాడారు. మమతాబెనర్జీకే తిరుగులేని మెజారిటీని ఇచ్చారు. ఈ అధికారాన్ని మమత దేనికి వినియోగిస్తారు? అలాగే వామపక్ష కూటమి తన పరాజయాన్ని ఎలా స్వీకరిస్తుంది? అన్నదానిమీదే పశ్చిమబెంగాల్ భవిష్యత్తు ఆధారపడి వుంటుంది.

మార్పు సాధించడమే గాని పగ సాధించడం తన లక్ష్యం

**బెంగాల్ (294) ఎన్నికల ఫలితాలు**

| | 2011 | 2006 | +/- |
|---|---|---|---|
| **తృణమూల్ +** | **227** | | |
| తృణమూల్ + | 184 | 30 | +154 |
| కాంగ్రెస్ | 42 | 21 | +21 |
| ఎస్‌యూసీఐ | 1 | 1 | --- |
| **వామపక్షాలు +** | **60** | | |
| సీపీఎం | 40 | 176 | -136 |
| సీపీఐ | 2 | 8 | -6 |
| ఫార్వర్డ్ బ్లాక్ | 11 | 23 | -12 |
| ఆరెస్పీ | 7 | 20 | -13 |
| ఇతరులు | 6 | 16 | -10 |

కాదని మమతాబెనర్జీ తన ఎన్నికల ప్రణాళికలో ప్రకటించారు. దానికి ఆమె కట్టుబడి వుంటారా? అన్నదే ప్రశ్న. ఆమె దశాబ్దాల తరబడి మార్క్సిస్టులతో నిత్య సంఘర్షణలతో ఎదిగారు. తన చుట్టూ ప్రతీకారం తీర్చుకునే వారు చేరారు. తనని తాను అదుపు చేసుకోవడం ఒక ఎత్తు కాగా, తన చుట్టూ వున్న వారిని అదుపుచెయ్యడం మరోఎత్తు. దీనికి ఏ మాత్రం అవకాశం ఇచ్చినా బెంగాల్ నిత్య సంఘర్షణల అగ్నిగుండం అవుతుంది. అలాగే బెంగాల్ ఆర్థిక వ్యవస్థనీ, పాలనా వ్యవస్థని దారిలో పెట్టడం కూడా అంతతేలికైంది కాదు. 34 ఏళ్ళుగా మార్క్సిస్టులు పాలనాయంత్రాంగాన్ని, పోలీసువ్యవస్థని తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. పై నుండి కిందిస్థాయి వరకు దానిని రాజకీయం చేశారు. ఈ యంత్రాంగాలను పార్టీ ప్రయోజనాలకు అతీతంగా వ్యవహరించేలా చెయ్యడం కష్టసాధ్యమైంది. అయినా చేసి తీరాలి. అందుచేత మమత తన ప్రజా విజయాన్ని అభివృద్ధి మార్గానికి సాధనంగా వినియోగించుకుంటే స్థిరమైన పాలనకి పునాదులు పడతాయి.

అలాగే మార్క్సిస్టు కూటమి తమ వైఫల్యాలను గుర్తించి గుణపాఠాలు నేర్చుకునే నమ్రతను ప్రదర్శించాలి. అలా కాకుండా తమ ప్రయివేటు బలగాలని ప్రతీకారం కోసం నిత్యసంఘర్షణలకు మొహరిస్తే వారు ప్రజలకి మరింత దూరం అవుతారు. 34 ఏళ్లు ఆదరించిన బెంగాల్ ప్రజలకు మరింత ద్రోహం చేసిన వారవుతారు.

### కొత్త అవినీతి స్థానంలో పాత అవినీతి

తమిళనాడు రాజకీయం పూర్తిగా దారితప్పింది, కరుణానిధి ఓటమికి కన్నీరు కార్చేవారు ఎవరూ లేరు. అది అవినీతి ప్రభుత్వం. 2జి స్పెక్ట్రమ్ కేసులో వారే ప్రధాన నిందితులు.

దీనికి తోడు రాష్ట్రంలో పాలన లేని స్థితి, వయోభారంలో కరుణానిధి, కుటుంబ కీచులాటలు – ఇలాంటి ప్రభుత్వపాలనకి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారు. గెలిచిన జయలలిత కూడా తక్కువేమీకాదు. అధికార దుర్వినియోగం అవినీతిలో ఆమె కూడా తక్కువ కాదని గతంలోనే చాటుకున్నారు.



జయలలితా

| తమిళనాడు (234) ఎన్నికల ఫలితాలు | | | |
|---|---|---|---|
| | 2011 | 2006 | +/– |
| **అన్నాడీఎంకే+** | 203 | | |
| అన్నాడీఎంకే | 150 | 61 | +89 |
| డీఎండీకే | 33 | 1 | +32 |
| సీపీఎం | 10 | 9 | +1 |
| సీపీఐ | 9 | 6 | +3 |
| ఫార్వర్డ్ బ్లాక్ | 1 | 0 | +1 |
| **డీఎంకే+** | **31** | | |
| డీఎంకే | 23 | 96 | –73 |
| కాంగ్రెస్ | 5 | 34 | –29 |
| పీఎంకే | 3 | 18 | –15 |

తమిళనాడు రాజకీయాన్ని అవినీతిమయం చెయ్యడంలో ఎన్నికల్లో కోట్లు గుమ్మరించడంలో, ప్రజల సొమ్ముతో ఎన్నికల ఉచితాలు పంచిపెట్టడంలో ఒకరిని మించి మరొకరు పోటీపడుతున్నారు.

ఒకనాడు భారతదేశంలో అభివృద్ధికీ, పరిపాలనకీ, మానవాభివృద్ధి సూచికలకీ మార్గదర్శకంగా వున్న తమిళనాడు ఇప్పుడు ఒక్కొక్కమెట్టు దిగజారుతున్నది. దాని బడ్జెట్లను 'ఉచితాల' భారం కుంగదీస్తున్నది. ఇప్పుడు జయలలిత అధికారంలోకి వచ్చినా ఈ పరిస్థితిని మార్చే స్థితి కనిపించడం లేదు. ఆమె ప్రకటించిన 'ఉచితాలే' ప్రజలకు ఉరితాళ్లుగా మారతాయి.



రంగస్వామి

| పుదుచ్చేరి (30) ఎన్నికల ఫలితాలు | | | |
|---|---|---|---|
| | 2011 | 2006 | +/– |
| **అన్నాడీఎంకే+** | 20 | | |
| అన్నాడీఎంకే | 5 | 3 | +2 |
| ఎన్ఆర్సీ | 15 | -- | +15 |
| **డీఎంకే+** | 10 | | |
| డీఎంకే | 2 | 7 | –5 |
| కాంగ్రెస్ | 7 | 10 | –3 |
| ఇతరులు | 1 | 6 | –5 |

### కేరళలో ఒకే నమూనా - రెండు కూటములు

మనదేశ రాజకీయంలోనే కేరళకు ఒక ప్రత్యేకత వుంది. గత మూడు నాలుగు దశాబ్దాలుగా రాజకీయ అవినీతి పెద్దగా అంటని రాష్ట్రంగా ఉంది. గత 15–20 సంవత్సరాలుగా దేశంలోనే కేరళ అభివృద్ధి నమూనా ఒక ప్రత్యేకతని సంతరించుకుంది. మానవాభివృద్ధి సూచికలకి అది మార్గదర్శకత్వాన్ని ఇచ్చింది. స్థానిక ప్రభుత్వాల సాధికారతకు చట్టబద్ధమైన ఏర్పాట్లు చేసింది. నిధులు, విధులు, సిబ్బందిని దఖలుపర్చింది.

ఈ రాష్ట్రంలో వామపక్ష కూటమి, ప్రజాస్వామ్య కూటములు రాజకీయంగా సంఘర్షణ పడుతున్నా ఈ అభివృద్ధి నమూనాకు రెండు పక్షాలు కట్టుబడి వుంటున్నాయి. ఇద్దరు సమ ఉజ్జీలైన మల్లయోధులు ఒకే గోదాలో పోరాడుతున్నారు. ఒకసారి ఒకరు గెలిస్తే మరోసారి మరొకరు గెలుస్తున్నారు. ఒకే అభివృద్ధి



**ఊమెన్ చాందీ**

### కేరళ (140) ఎన్నికల ఫలితాలు

| | 2011 | 2006 | +/- |
|---|---|---|---|
| **యుడీఎఫ్** | 72 | | |
| కాంగ్రెస్ | 38 | 24 | +14 |
| ఎంయూఎల్ | 20 | 7 | +13 |
| కేఈసీ(ఎం) | 9 | 7 | +2 |
| ఇతరులు | 5 | | |
| **ఎల్డీఎఫ్** | **68** | | |
| సీపీఎం | 45 | 61 | -16 |
| సీపీఐ | 13 | 17 | -4 |
| ఎన్‌సీపీ | 2 | 1 | -1 |
| జేడీ(ఎస్) | 4 | 5 | -1 |
| ఆరెస్పీ | 2 | 3 | +1 |
| స్వతంత్రులు | 2 | | |

నమూనాకావడంతో ప్రజలలో ఏ కూటమిలైనా తీవ్ర అనుకూలతలు, తీవ్ర వ్యతిరేకతలు వ్యక్తం కావడం లేదు. ఈ నమూనా పరిధి దాటి ఏ కూటమీ కొత్త ప్రయత్నాలు చెయ్యకపోవడమే కేరళ రాజకీయంలో తీవ్రమైన లోటు – ఆ రాష్ట్రంలో సంస్కరణ ఉద్యమాల నేపథ్యం వుంది. అవినీతి పెచ్చరిల్లని రాజకీయం వుంది. మానవాభివృద్ధి, స్థానిక ప్రభుత్వం పునాది వుంది. దీనిని మెట్టు మెట్టు పైకి ఎక్కించాలి. మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్యం అందించడంలో యువతకు ఉపాధి నైపుణ్యాలు అందించడంలో పాలనలో ప్రజల సాధికారతను పెంచడంలో కొత్త పుంతలు తొక్కే రాజకీయం కేరళకు తక్షణావసరం. కొత్త ప్రభుత్వం అలాంటి చొరవలు తీసుకోవాలి. – ప్రతిపక్షం అలాంటి ఒత్తిడి తేవాలి. అప్పుడే కేరళ దేశానికి మరో కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తుంది. ప్రస్తుతానికి అది కేరళలో మాత్రమే సాధ్యం. ■



# కడపలో సానుభూతి పవనం



అసెంబ్లీ నియోజక వర్గం నుండి దివంగత ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖరరెడ్డి భార్య విజయమ్మ 81,373 ఓట్ల మెజారిటీతోనూ కడప పార్లమెంటు నియోజకవర్గం నుండి వై.యస్.జగన్మోహన్ రెడ్డి 5,45,672 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. గెలుపు అందరూ ఊహించినదే అయినా వై.యస్.రాజశేఖరరెడ్డి అడ్డాలో ఆయన మరణానంతరం జరిగిన ఈ ఎన్నికలో సానుభూతి పవనం వెల్లువెత్తినట్టు కనిపిస్తున్నది. డబ్బు, మద్యం, పంపిణీ, ప్రచార ఆర్భాటాలలో తరతమభేదాలతో అన్ని పార్టీల అభ్యర్థులు పోటీపడ్డా అంతిమంగా ఇది సానుభూతి గెలుపుగా పరిణమించింది. ఈ ఉపఎన్నికల ఫలితాల ప్రభావం ప్రత్యక్షంగా కాంగ్రెస్ పార్టీకి పెద్ద షాక్‌గా దాని భవిష్యత్తును అయోమయంలో పడేసింది. మరోపక్క కాంగ్రెస్‌లో చీలిక తమకు ఉపకరిస్తుందని భావించిన తెలుగు దేశం పార్టీకి ఆశాభంగం కలిగింది తెలుగు దేశంపార్టీ ఎంతగా బలహీన పడిందో ఈ ఉపఎన్నిక ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

# విద్యుత్ రంగంపై విధానాలు లేని రాష్ట్ర ప్రభుత్వం

**(విద్యుత్‌రంగంపై శాసనసభలో జరిగిన చర్చలో డా॥ జయప్రకాష్ నారాయణ్ చేసిన ప్రసంగ పాఠాన్ని ఇస్తున్నాం.)**




అధ్యక్షా, విద్యుత్ రంగాన్ని మించినటువంటి కీలకమైన రంగం ఆర్థికాభివృద్ధికి ఇంకొకటి లేదు. మంత్రి గారి ప్రభుత్వ ప్రకటనంతా ఎట్లా వుందంటే, ఏడు సంవత్సరాల కాలంలో 63 శాతం విద్యుత్ వినియోగం పెరిగింది. 45 శాతం వినియోగదారులు పెరిగారని అటువైపు చూపిస్తూ నొక్కి మరీ చెప్పారు. అధ్యక్షా, 9 శాతం ఆర్థికాభివృద్ధి దేశంలో జరుగుతుంటే మన రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని మనం అనుకుంటుంటే. ఏడేళ్లలో 63శాతం వినియోగం పెరుగుదలని మీరు ఊహించలేదా? నిజానికి ఏడేళ్లలో వంద శాతం పెరగాలి. అలాంటిది ఆర్థికాభివృద్ధి శరవేగంగా జరుగుతున్న కాలంలో, 63 శాతం మాకు వినియోగం పెరిగింది కాబట్టి, మేము చేతులెత్తేస్తున్నాం అంటున్నారంటే, ప్రభుత్వానికి ఏరకమైన ముందుచూపు గాని, ఆలోచనగాని, ఆర్థికాభివృద్ధి పట్ల దృష్టిగాని కనిపించడం లేదు.

అధ్యక్షా, ఇదేదీ ప్రజలు అడుక్కోవడం లేదు. అయ్యా మాకేదన్నా ఇవ్వండని అడగడం లేదు. వినియోగదారుల్లో వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు 26 లక్షల మంది మినహాయిస్తే ప్రతి ఒక్కళ్లకీ మీటర్లున్నాయి. ప్రతి ఒక్కళ్లకీ బిల్లులు వేస్తున్నారు. ప్రతి ఒక్కళ్ల దగ్గర ముక్కు పిండి చార్జీలు వసూలు చేస్తున్నారు. సకాలంలో డబ్బులు చెల్లించకపోతే, మీటర్లు కట్‌చేసి విద్యుత్ లేకుండా చేస్తున్నారు. మనం 2011వ సంవత్సరంలో వున్నాము. ప్రభుత్వం వారి లెక్కల ప్రకారమే.. జాగ్రత్తగా చూశాను. ఇవాళ 15 వేల కోట్ల రూపాయల పైచిలుకు విద్యుత్ రంగంలో వినియోగదారుల నుంచి అంటే వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్ ఇస్తున్నా కూడా, దాన్ని ప్రక్కన పెట్టినా కూడా 15 వేల కోట్ల రూపాయల పై చిలుకు వినియోగదారుల నుండి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. వ్యవసాయం కోసం ప్రభుత్వ ఖజానా నుండి దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయలు సబ్సిడీగా ఇస్తున్నారు. అంటే 19 వేల కోట్ల రూపాయలు చెల్లిస్తున్నాము. అధ్యక్షా. డబ్బులు చెల్లించి మాకు విద్యుత్తు కావాలి. మా పిల్లలు చదువుకోవడానికి మా పరిశ్రమలను నడుపుకోవడానికి, మేము టీవీ చూడటానికి, ఫ్యాన్లు తిరగడానికి, వేసవి కాలంలో హాయిగా నిద్రపోవడానికి డబ్బులు చెల్లించి మేము, విద్యుత్తు కొనుకుంటామంటే, ప్రస్తుత సంవత్సరంలో కూడా, వర్షాలు బాగా కురిసి, రిజర్వాయర్లన్నీ పూర్తిగా నిండిఉండి, ఈ సంవత్సరంలో కూడా మాకు బ్రహ్మాండంగా వినియోగం పెరిగింది కాబట్టి మేము విద్యుత్తును ఇవ్వలేకపోయాం అంటున్నారు. ఇది నిజంగా ఆర్థికాభివృద్ధిని సాధించే పద్ధతేనా అధ్యక్షా? ఈ ప్రశ్నను సూటిగా అడగాలి. ఏదో ఈ రోజు ఒక load shedding అయ్యింది. ఒక వంద మెగావాట్లు నష్టపోయింది. ఈ పూట కలిసొచ్చింది. అవన్నీ మాకు అనవసరం. మీరు ఏమి తంటాలు పడతారో మాకు అవసరం. 2011న సంవత్సరంలో మేము డబ్బులిచ్చి విద్యుత్ కొంటామని అంటే ఆ విద్యుత్తును

ఇవ్వలేకపోతున్నారంటే అటువంటి ప్రభుత్వానికి మనుగడసాగించే అర్హత ఉన్నదా? అని అడుగుతున్నాను.

అధ్యక్షా, విద్యుత్తు సరఫరాలో కూడా క్వాలిటీ అధ్వాన్నంగా ఉంటుంది. సరఫరా ఉండటం లేదు అది వేరే విషయం హైదరాబాద్ నగరం నడిబొడ్డులో కూడా, నా నియోజకవర్గమైన కూకట్‌పల్లిలో ఇబ్బడిముబ్బడిగా విద్యుత్తు వినియోగం పెరుగుతోంది. ఇప్పటికి కూడా 220 కిలో వాట్ల సబ్ స్టేషన్‌ను అక్కడ ఏర్పాటు చేయాలని చాలా కాలం నుంచి ప్రతిపాదనలు ఉన్నప్పటికీ, ఈ నాటికి కూడా కనీసం ప్రారంభం కాలేదు. అంటే ఉన్న విద్యుత్తును ఎలా పంపిణీ చేయాలి? నష్టాన్ని ఎలా నివారించాలి? క్వాలిటీని ఎలా పెంచాలి? అనే విషయంలో ప్రభుత్వానికి కనీసమైన అవగాహనగానీ, శ్రద్ధగానీ లేదని స్పష్టంగా అర్థమవుతుంది.

విద్యుత్తు వాడకం ఇంకా పెరగబోతుంది. ఇప్పటికీ కూడా మన రాష్ట్రంలో సగటు విద్యుత్తు వినియోగం ఒక సంవత్సరానికి కేవలం 900 యూనిట్లు రోజుకి కేవలం రెండున్నర యూనిట్లను మాత్రమే వినియోగిస్తున్నాము. ఇంకా వెయ్యి యూనిట్లు కూడా దాటలేదు. ప్రపంచంలో ఉన్న నిరుపేద దేశాలలో కూడా సంవత్సరానికి రెండు వేలు, మూడు వేల యూనిట్లు వినియోగం ఉంది. 900 యూనిట్లు వినియోగం ఉంటేనే మనం ఈ స్థాయిలో చేతులెత్తేస్తుంటే, రేపు మధ్యస్థాయి దేశంగా ఈ దేశం ఎదిగితే, ఆర్థికాభివృద్ధిని ఈ ప్రభుత్వం దారుణంగా చేసినా, పూర్తిగా విఫలమైనా అవినీతి భయంకరంగా ఉన్నా, ప్రజల ప్రయత్నం వల్ల ఆర్థికాభివృద్ధి పెరిగితే, రేప్రొద్దున కనీసం 15 వందలు, 2 వేల యూనిట్లకు వినియోగం పెరగాలని కోరుకుంటున్నాం. ఆ విధంగా పెరిగితే, ఇక ప్రభుత్వం ఇంట్లో పడుకోవడమే జరుగుతుంది.

ఈ నేపథ్యంలో నేను నిర్దిష్టమైన కొన్ని క్లారిఫికేషన్లను అడుగుతున్నాను. మొట్టమొదటిది, ఏపీ జన్కో నుంచి పవర్ పర్చేజ్ అగ్రిమెంటు చేసిన ప్రైవేటు ప్రాజెక్టుల నుంచి, మర్చెంట్ పవర్ ప్లాంట్ల నుంచి విడివిడిగా సగటున పర్చేజ్ కాస్ట్ ఎంత ఉంటున్నది? ఉదాహరణకి మార్చి మాసంలో 250 మిలియన్ యూనిట్లు దాటి రోజువారీ వినియోగం పెరిగిపోయింది. మేము చాలా కష్టాల్లో ఉన్నామన్నారు. మంచిది అయితే మీరు సగటున ఎంతకు కొంటున్నారో స్పష్టంగా ఈ సభ ముందు పెడతారా? ఇప్పుడు చెబుతారా? పెడతారా అంటే రేప్రొద్దున పెడతానుంటారు. వచ్చేనెల అంటారు. ఎవరికీ అర్థం కాదు. ఇప్పుడు చెప్పాలి. నిర్దిష్టంగా ఏ.పీ జన్కో ప్లాంటుకు పవర్ పర్చేజ్ అగ్రిమెంటు చేసి ప్రైవేటు ప్రాజెక్టుల నుంచి మూడవది మార్చెట్ పవర్ ప్లాంట నుంచి కొంటున్నామంటున్నారు. కాబట్టి ఆ మూడింటికీ విడివిడిగా average cost for the month of march మార్చిది ఉంటే మార్చిది, ఫిబ్రవరిది ఉంటే ఫిబ్రవరిది ఇవ్వండి.

రెండవది, ఈ మూడు రంగాలలో ఉన్న ప్లాంట్లకు జెన్‌కో గానీ, ప్రైవేటు ప్లాంట్లుగానీ, మర్చెంట్ పవర్ ప్లాంట్లుగానీ, ప్లాంటు వారీగా మొత్తంగా ప్లాంటు లోడ్ ఫ్యాక్టర్లను ఇవ్వండి. మూడు రంగాలకు సంబంధించి విడివిడిగా ఇవ్వండి, కలిపి ఇవ్వకండి. ఎందుకంటే ఇరవై ముప్పయి ఏళ్ల క్రితం కూడా పిఎల్ఎఫ్ ఈ రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నది. జలగం వెంగళరావు గారి కాలం నుంచి నార్ల తాతారావు గారి పుణ్యమా అని చెప్పి అప్పటి నుంచి 90 శాతం. 97 శాతం పిఎల్ఎఫ్‌లో ఒక్క థర్మల్ పవర్ స్టేషన్‌లో భారతదేశంలో తప్ప ప్రపంచంలో ఇంకెవరూ చూడలేదు. కాబట్టి, స్పష్టంగా ఇక్కడ ఉన్న కెపాసిటీని మనం ఉపయోగిస్తున్నామా? అన్నది అజ్జర్వ్ చేసే హక్కు ఈ సభకు ఉన్నది.

మూడవది ఇందాక పెద్దలు డి.నరేంద్ర కూమార్ గారు మెన్షన్ చేశారు. సెంట్రల్ పవర్ గ్రిడ్ నుంచి మన రాష్ట్రానికి అతి పెద్ద వాటా ఎప్పుడు వస్తోంది? నిర్దిష్టంగా మాసం వారీగా ఎంత షేరు వస్తోంది? అసలు సెంట్రల్ పవర్ గ్రిడ్‌లో ఎన్ని యూనిట్లు నెల వారీగా ఉత్పత్తి అవుతున్నాయి? దానిలో ఆంధ్రప్రదేశ్ వాటాగా ఎంత వస్తున్నది? నిర్దిష్టంగా సభ ముందు పెట్టండి. మిగిలిన నాలుగు రాష్ట్రాల వాటాలను కూడా తెలియజేయండి.

నాలుగవది ఇంత చేసినా ఇప్పటికీ కూడా ఈ రాష్ట్రంలో మర్చెంట్ పవర్ ప్లాంట్ల కోసం అదే పనిగా వెంపర్లాట జరుగుతున్నది. ఇప్పటికీ కూడా ప్రభుత్వం దానిని ప్రోత్సహిస్తోంది. రేప్రొద్దున మీకు విద్యుత్తు కొరత ఉన్నప్పుడు కొనాలంటే వాళ్లు ఎంత చెబితే అంతకు రూ॥11, రూ॥12 అయినా కొనాల్సిందే. మన రైతులకు భూములు పోతాయి. మనకు పొల్యూషన్ మిగులుతుంది. మనకు ఉద్యోగాలు రావు. ఇతర రాష్ట్రాలో ఉద్యోగాలను ఎగుమతి చేయడం కోసం మన రాష్ట్రంలో అన్నీ రకాలుగా నష్టపోయి చివరకు విద్యుత్తును కొనాల్సి వస్తే రూ॥11, రూ॥12 వెచ్చించి కొనుక్కొని, మన ఖజానాను లూటీ చేయడమేనా మన ఉద్దేశం. మర్చెంట్స్ పవర్ ప్లాంట్స్ విషయంలో ఇప్పటికైనా మేము ఆపేస్తున్నామనే విధానాన్ని మీరు చేపడతారా లేదా?

అయిదవది, 2017 మార్చి నాటికి 18వేల మెగావాట్లు ఉత్పత్తి కొత్తగా వస్తుందని చెబుతున్నారు. కేవలం కెపాసిటీ కాకుండా. ప్లాంటు వారీగా (వేరియబుల్ కాస్ట్ ఫ్యూయల్ కాస్ట్ ఈ రోజు మనం చెప్పలేము దానిని ప్రక్కన పెడదాం.) ఫిక్స్‌డ్ కాస్ట్‌ను మీరు నిర్దారించారా? నిర్దారిస్తే ప్లాంట్ వారీగా ఫిక్స్‌డ్ కాస్ట్ పర్ యూనిట్ ఎంత పడబోతున్నది? ఏ రూపేణ నిర్దారణ చేశారు?

ఆరవది గతంలో సింహాద్రి పవర్ ప్రాజెక్టు నుండి ఏ రేటుకైతే మనం కొంటున్నామో అదే రేటుకి హిందుజా నుంచి కొంటామన్నారు. ఇటీవలి కాలంలో వస్తున్న వార్తలు సభలో చేస్తున్న స్టేట్‌మెంట్లు కూడా తికమకగా ఉన్నాయి. స్పష్టంగా నిర్దిష్టంగా ఎన్‌టీపీసి నుంచి సింహాద్రి పవర్ ప్రాజెక్టు నుంచి ఏ రేటుకి కొంటున్నారో అంతకు మించి ఒక్క పైసా కూడా ఎక్కువ పెట్టి మేము కొనము. ఖచ్చితంగా రాష్ట్ర అవసరాల మేరకు, ఆ రేటుకు రాష్ట్రానికి సరఫరా చేసేటట్లయితే ఆ ప్రాజెక్టుని రానిస్తాము అన్న ప్రకటన ఈ సభ నుంచి మంత్రిగారి ద్వారా వస్తుందా రాదా?

ఏడవది, ఇప్పటికీ 24 గంటల విద్యుత్తు పట్టణ ప్రాంతాలలోని పారిశ్రామిక అవసరాలకు కూడా అందడం లేదంటే, నిజంగా సభలో – ప్రభుత్వం శాసనసభ్యులుగా మనమంతా సిగ్గుపడాలి. ప్రపంచంలో బాగా వేగంగా ఎదుగుతున్న ఏ దేశంలో కూడా 24 గంటలు విద్యుత్తు లేకుండా లేదు. మన దేశంలోని గుజరాత్ రాష్ట్రంలో అగ్రికల్చర్ ఫీడర్స్‌ని మిగిలిన ఫీడర్స్ నుంచి వేరు చేసిన తరువాత ప్రతి గ్రామానికి ఢంకా భజాయించి గుండె మీద చెయ్యి వేసుకొని 24 గంటలు విద్యుత్ ఇస్తున్నామని చెప్పుకోగలుగుతున్నారు. లోక్‌సత్తా ఒక ఉద్యమంగా ఎన్నో సంవత్సరాల క్రితం పశ్చిమ గోదావరి జిల్లా కళ్ళ చెరువులో 24 గంటల విద్యుత్తును ఎట్లా ఇవ్వాలో మేము చేసి చూపించాము. ఒక ఫీడర్ లైన్ తీసుకొని, అక్కడ ఏ రకంగా ఓల్టేజ్ ఫ్లక్చువేషన్స్ లేకుండా, రైతులకు అసౌకర్యం లేకుండా, నూటికి నూరు పాళు వ్యవసాయేతర పనులకు గ్రామీణ ప్రాంతాలలో 24 గంటల విద్యుత్తు ఇవ్వడం మేము చేసి చూపించాం.

ఇప్పటికైనా గుజరాత్‌లో చేసిన రీతిగా మీరు franchising పెట్టుకొని డి–సెంట్రలైజేషన్ ద్వారా డిస్ట్రిబ్యూషన్ పెట్టుకొని విధిగా అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫార్మర్లను వేరు చేసి, గ్రామీణ ప్రాంతాలలో 24 గంటల విద్యుత్తును ఇస్తారా? దానికి స్పష్టమైన పథకం ఉన్నదా? అది చేస్తారా అంటే నీళ్లు నములుతున్నారు తప్ప, నిర్దిష్టంగా ఫలాన కాలానికి ఇంత పెట్టుబడి పెట్టి ఇన్ని సంవత్సరాలలోపు, ఈ సభలో ఈ విధమైన చర్చ లేకుండా, 24 గంటలు ప్రతి గ్రామానికి విద్యుత్తునిస్తామని చెప్పే పరిస్థితి లేదు. సిగ్గుచేటు ఇప్పుడు కూడా పట్టణాలకు మండల కేంద్రాలకు కూడా load shedding పగలు చేస్తున్నామని చెప్పే ప్రభుత్వం. రాత్రి ఎట్లాగు పవర్ రాదు. ఈ రోజు ఒక్క గ్రామమంటే ఒక్క గ్రామానికి కూడా ఆంధ్రప్రదేశ్‌లో 24 గంటల విద్యుత్ సరఫరా ఉందని చెప్పే పరిస్థితి లేదు. ఇప్పుడు సరే అయిదేళ్లకు ఇస్తాము, దానికి ఈ పథకం ఉంది. ఇంత ఖర్చు పెడుతున్నామని చెప్పమనండి. అది కూడా చెప్పలేకపోతే ఎందుకు ఉన్నదీ ప్రభుత్వం? విద్యుత్తును గ్రామాలకు పట్టణాలకు అందించలేకపోతే ప్రభుత్వం ఎందుకు? ప్రణాళికలు ఎందుకు? పన్నులెందుకు? ఈ బడ్జెటెందుకు?

నీరు గురించి ఈ రోజు చేసిన ప్రకటనలో చెప్పారు. శ్రీశైలం రిజర్వాయర్‌ను ఖాళీ చేసి మరీ క్రింద ప్రాంతాలకు అవసరం ఉన్నా లేకపోయినా సంక్షోభాన్ని గట్టెక్కించడానికి అర్జెంటుగా జలవిద్యుదుత్పత్తి చేశాము. ఆ తరువాత నాగార్జున సాగర్‌ని ఖాళీ చేస్తారు. సముద్రంలోకి పంపించేస్తారు. నీళ్లు ముఖ్యమా? విద్యుత్తు ముఖ్యమా? మనం మన అసమర్థత పూర్తిగా ప్రభుత్వానికి దూరదృష్టి లేకపోవడం వలన ఉన్న నీటిని తగలబెట్టేసుకుని, రేప్రొద్దున నీళ్లు లేవని చేతులెత్తడం కంటే ప్రమాదం మరొకటి లేదు. ఇప్పటికే కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్‌లో వాళ్లు ఏమి చెబుతున్నారు? మీరు 150 టిఎంసీలను carry over గా ఉంచుకోండి. ఇక నుంచి వచ్చే సంవత్సరం వర్షాలు కురవకపోతే మీ కర్మ మీరు ఉంచుకోండని చెప్పారు. మనం ఏమంటున్నాం. మేము 75 శాతం మాకు గ్యారంటీ ఇచ్చిన తరువాత డిపెండబులిటీ ఇచ్చిన తరువాత, దానిలో ఫస్ట్ ఛాయిస్‌గా పెట్టమని మనం కోరుతున్నాం. వాళ్లు నేటి వరకు అటువంటిదానిని నీరు, విద్యుత్ కోసం వదిలేస్తారంటే రేపు ఈ రాష్ట్రంలో నీరు, విద్యుత్ ఉండదు. ప్రభుత్వానికి జల విద్యుత్‌ని ఎప్పుడు తీసుకువస్తామనే విషయంలో స్పష్టమైన అవగాహన ఉందా? ఆపద్ధర్మంగా అప్పుడు ఇప్పుడని చెప్పడం కాదు. పరిస్థితుల దృష్ట్యా రేపు చేతులు ఎత్తేద్దామనే విధంగా కాదు. నీరు అంతా ఇప్పుడే వినియోగం చేసి రేపు విద్యుత్, నీరు లేకుండా చేస్తారా?

చివరి విషయం, భవిష్యత్తులో మరింత సంక్షోభంలో జల, విద్యుత్‌ని తీసుకురావడం కాదు. కృష్ణా జల వివాద ట్రిబ్యునల్‌లో

వారు ఇచ్చిన తీర్పులో మార్పులు చేస్తారని అనుకొన్నా ఈ రాష్ట్రం తట్టుకోవాలంటే, నాగార్జునసాగర్ దిగువకి నీరు ఒక చుక్క కూడా వెళ్లే అవసరం లేకుండా చేసి కృష్ణా డెల్టా అవసరాలను కేవలం నాగార్జునసాగర్ దిగువ ఉన్న ప్రాజెక్టుల ద్వారా లేదంటే, గోదావరి నుంచి నీటిని మళ్ళించి కృష్ణా డెల్టాకి వినియోగించేలా చేయాలి. దాని వల్ల ఎగువ ఉన్న తెలంగాణా, రాయలసీమ, నాగర్జునసాగర్, శ్రీశైలం నీటిని పూర్తిగా వినియోగించే అవకాశం ఏర్పడుతుంది.

రాష్ట్రంలో జలవనరులున్నాయి. 1670 మెగావాట్ల జల విద్యుత్ నాగార్జునసాగర్‌లో ఉత్పత్తి ఉంది. ప్రభుత్వానికి ఏ మాత్రం ఇంగితజ్ఞానం, ముందు చూపు, దూరదృష్టి ఉన్నా, 1670 మెగావాట్లు భవిష్యత్తులో ఉండదని అనుకోవాలా? అంతేగానీ అది ఇరిగేషన్, ఇది పవర్ అని లెక్కలు వేసుకోవాలంటే కాదు. 1670 మెగావాట్లు సమీప భవిష్యత్తులో మాకు అందదు. నాగార్జునసాగర్ నుండి మీరు క్రిందకు రాకుండా మేనేజ్ చేస్తున్నాము. గోదావరి నుండి కృష్ణా బేసిన్‌కి నీరందించాక జల, విద్యుత్ పైన నుండి రాదని లెక్క వేసుకొన్నా, అవసరాలనుబట్టి ఇప్పటికయినా తెస్తారా? ఈ పనులు రేపు చేస్తామని అనడం కాదు. 30 సంవత్సరాల నుండి చూస్తున్నాము. కాబట్టి భవిష్యత్తులో చేయడం కోసం నిర్దిష్టమైన ప్రమాణాలు చేయాలి. మంత్రిగారు మాట ఇవ్వాలి. ఆ విధంగా మాట ఇస్తారని ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**డా॥ జయప్రకాష్ నారాయణ:** అధ్యక్షా, నేను సమయం ఎక్కువ తీసుకోను. ముందుగా కొరత ఉన్నప్పుడు ఖచ్చితంగా యంత్రాంగం రోజువారీ రాత్రింబగళ్లు పనిచేస్తున్నారని నాకు తెలుసు. లేకపోతే ఇంత కొరత ఉన్నప్పుడు, ఇన్ని ఒత్తిళ్లు ఉన్నప్పుడు దీన్ని తట్టుకోవడం కష్టం. అందుచేత ఇవాళ, రేపు ఏమీ చేస్తారు అనే విషయంలోకి నేను వెళ్లను. ఏదో తంటాలు పడుతున్నాం. గంతకు తగ్గ బొంత. గౌరవ ముఖ్యమంత్రి గారు కూడా సభలో ఉన్నారు కాబట్టి నేను కొన్ని నిర్దిష్టమైన అంశాలు తెలియచేస్తాను. దయచేసి ఒకసారి ఆలోచించండి. ఈ క్షణాన సమాధానం నేను ఎక్స్‌పెక్ట్ చేయడం లేదు.

మొట్టమొదటిది 30 వేల నుంచి 40 వేల మెగావాట్ల మర్చంట్ పవర్ ప్లాంట్స్ 2003 చట్టంను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలోకి వస్తున్నాయి. ప్రతిసారీ మనం దాని గురించి మాట్లాడుకుంటున్నాం. అధ్యక్షా, ఖచ్చితంగా మన రాష్ట్ర అవసరాలు ఎంత మేరకున్నాయి? మర్చంట్ పవర్ ప్లాంట్స్ 2003 చట్టం ప్రకారం రావాలంటే వాళ్లను ఏదో రకంగా ఇరుకున పెట్టడానికి మనకు మార్గాలున్నాయి. ప్రభుత్వం మన చేతుల్లో ఉంది. పొల్యూషన్ కంట్రోల్ దగ్గర నుంచి పవర్ ట్రాన్స్‌మిషన్ వీలింగ్ అగ్రిమెంట్ దాకా మన చేతుల్లో ఉంది. వాళ్లు ఆకాశం నుంచి తీసుకోవడం లేదు. కాబట్టి విధిగా first right of refusal ఇచ్చి ఈ రాష్ట్రానికి అవసరమైతే మనం ముందుగానే నిర్ధేశించిన రేటుకు కొనుక్కునే ఏర్పాటు చేసి ఆ తరువాతనే అమ్ముకునేట్లు చేయటం ఒకటి. రాష్ట్రంలో పొల్యూషన్ లేకుండా ఉండే రీతిని మినిమమ్ పొల్యూషన్ ఉండే రీతిలో 30,40 వేల మెగావాట్ల నుంచి చాలా గణనీయంగా తగ్గించడం రెండవది. అధ్యక్షా, ఈ రెండూ ఖచ్చితంగా మన అధికార్లు, మన ప్రభుత్వం చేతుల్లో ఉన్నాయి. మనం అంత నిరాశ పడనక్కర్లేదు. దయచేసి దాన్ని లోతుగా పరిశీలించండి. ప్రతిసారీ మనం ఫైరింగుల దాకా వెళ్లడం, పొల్యూషన్ పొందడం, విద్యుత్తును మాత్రం ఎక్కువ రేటుతో కొనడం ఈ పద్ధతి సరియైనది కాదు.

రెండవ విషయం మంత్రిగారి సమాధానంలో తమిళనాడుకు 31 శాతం సెంట్రల్ సదరన్ గ్రిడ్ నుంచి వెళుతుంటే మనకు 24 శాతం మాత్రమే వస్తున్నది. తమిళనాడు కంటే మనది పెద్ద రాష్ట్రం. పారిశ్రామికంగా వాళ్లు ముందున్న మాట వాస్తవమే. కానీ నాకు గుర్తున్నంత వరకూ... అది కరెక్ట్ కూడా కాకపోవచ్చు. 29 లేదా 30 శాతం మనకు వచ్చేది. అంటే మనకు వచ్చే శాతం తగ్గినట్లు కనబడుతున్నది. దయచేసి పున్హపరిశీలించి మన రాష్ట్రానికి వాటా పెంచే ఏర్పాటు చేయాలి. అది వెంటనే జరగదని నాకు తెలుసు కానీ కనీసం కొత్తగా వచ్చిన జనరేషన్ కెపాసిటిలో మనకు వచ్చినట్లైతే ఆ మేరకు మన జనాభా దామాషా వచ్చేట్లుగా గట్టిగా పోరాటం చేస్తే మనకు న్యాయం జరుగుతుంది. మూడవ విషయం హిందూజాకు సంబంధించి ఇప్పటికి కూడా మంత్రి గారు స్పష్టంగా చెప్పడం లేదు. 25 శాతం ఆఫర్ ఇస్తామంటున్నారు మేము ప్రయత్నం చేస్తున్నాం, ఆపుతున్నాం కుదరలేదని చెబుతున్నారు. ఇందులో రెండు అంశాలున్నాయి. ఒకటి షేర్, ఎంత ప్రభుత్వానికి కొనుగోలు ఒప్పందం ద్వారా వస్తుంది? రెండు ఏ రేటుకు వస్తుంది? నాకు నిర్దిష్టమైన హామీ ఈ సభ నుంచి కావాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ విశాఖపట్టణంలో కేంద్ర ప్రభుత్వంలో ఉన్నటువంటి NTPC ఏర్పాటు చేసినటువంటి సింహాద్రి పవర్ ప్రాజెక్టు ఫిక్సుడు కాస్ట్ కంటే ఎక్కువ లేకుండా ప్రతి యూనిట్‌కు పొందుతామా? 25 శాతమా, 30 శాతమా లేదా 70 శాతమా

ఆ హామీ రాకపోతే ఇది ఖచ్చితంగా అసంపూర్ణమైన అంశమే. లేకపోతే కొన్ని వేల కోట్ల రూపాయలు నష్టపోతాం.

నాలుగవ విషయం మంత్రి గారు మొన్న అడిగారు, మరలా అడిగారన్నారు. అధ్యక్షా ఇంకో వంద సార్లైనా అడుగుతాను. 24 గంటలు విద్యుత్తును పొందే హక్కు ఈ రాష్ట్ర ప్రజలకు ఉండాలి. ఒక్కరోజులో మీరు అది చేయలేరు. ఒక్క రాత్రిలో వచ్చేది కాదు. ముఖ్యమంత్రి గారి నుంచి స్పష్టమైన పథకం కావాలి. అధికార యంత్రాంగం మీద ఒత్తిడి కావాలి. దానికి వనరుల కేటాయింపు కావాలి. ఇదేమీ ప్రభుత్వం ఉచితంగా ఇవ్వడం లేదు. మీరు పెట్టే వెయ్యి కోట్ల పెట్టుబడికి రెండు వేల కోట్ల రూపాయల లాభం వస్తుంది. విద్యుత్తును 24 గంటలు సప్లై చేసే శక్తి మీకు ఉంటే విద్యుత్తుకు వచ్చే రెవెన్యూ ఆదాయం కావచ్చు, పారిశ్రామికీకరణ వల్ల వచ్చే ఆదాయం కావచ్చు. ఉపాధి పెరగడం వల్ల వచ్చే ఆదాయం కావచ్చు. రాజకీయ లబ్ధి కావచ్చు. అవన్నీ మనకు లాభమే. కాబట్టి దీన్ని ఏదో చేస్తున్నాం, చూస్తున్నాం. ఒక పైలట్ ప్రాజెక్టు పెట్టాం, తరువాత ఆలోచిస్తాం, తాత్కాలికంగా ప్రతిపక్ష నాయకులు ఈపూట ఏదో అన్నారని ఈ పూట చూస్తాం.... అధ్యక్షా, ప్రతీ పూటా పరగడుపే, ఈ పూటకు చాలా సమస్యలుంటాయి. ఈ పూట సమస్యలు రేపటికి ప్రతిబంధకాలైతే ఖచ్చితంగా తప్పే. అది ఈ మాట ఎవరో ఒకరు చెప్పాల్సిన అవసరం ఉంది. దానికి మంత్రి గారు నొచ్చుకోవలసిన అవసరం లేదు. మాకు తెలుసు, విద్యుత్ అవసరాలన్నీ మాకు తెలియదా అంటున్నారు. ఈవేళ రాష్ట్రంలో పరిశ్రమలు పెడితే కిరణ్ కుమార్ రెడ్డి గార్ని అడగండి. వారికి పారిశ్రామిక రంగం పూర్తిగా తెలుసు. ఎవరన్నా ఒక్కళ్ళు పరిశ్రమ పెట్టాలంటే గవర్నమెంటు మీద ఆధారపడకుండా సొంతంగా పెట్టిన పూర్తిగా తెలుసు. ఎవరన్నా ఒక్కళ్లు పరిశ్రమ పెట్టాలంటే గవర్నమెంటు మీద ఆధారపడకుండా సొంతంగా పెట్టగల దమ్ములున్నాయా? అధ్యక్షా, పరిశ్రమలను పెట్టలేకపోతే ఎట్లా? డబ్బులిచ్చేది వాళ్లు, సంపద సృష్టించేది వాళ్లు ఉపాధిని కల్పించేది వాళ్లు, ఆదాయాన్ని కల్పించేది వాళ్లు కాబట్టి ఖచ్చితంగా పారిశ్రామిక రంగంలో ఇవేళ రాష్ట్రంలో ఎంత జరేషన్ కెపాసిటీ సొంతంగా వాళ్లు పెట్టుకోవలసి వచ్చింది, ఆ వివరాలు దయచేసి సభముందు పెట్టాలని కోరుతున్నాను.

మెట్రోపాలిటన్ వాటర్ సప్లై బోర్డు అధ్వాన్న స్థితిలో ఉంది. దయచేసి ఎలక్ట్రిసిటీ బోర్డుల దగ్గర, డిస్కమ్‌ల దగ్గర ఉన్న బిల్లింగ్ డేటా వాటర్ సప్లై బోర్డుకిచ్చి... ఎందుకంటే వాటర్ సప్లై ఉంటే వాళ్లకు విద్యుత్తు సప్లై కూడా ఉంటుంది. విద్యుత్ సప్లై విషయంలో వారిని మెచ్చుకోవాలి. అక్కడక్కడ కొన్ని పొరపాట్లు జరుగుతున్నా వాటర్ సప్లైతో పోలిస్తే మీటరింగ్, బిల్లింగ్ ప్రాపర్‌గా ఉంది. వాటర్ సప్లై బోర్డు అధ్వాన్నంగా ఉంది. ఈ రెండూ Reconcile చేయవలసిందిగా కోరుతున్నాను. ముఖ్యమంత్రి గారు వాటర్ సప్లై బోర్డుకు అధ్యక్షులు కూడా కాబట్టి ప్రత్యేకంగా ఆ పని చేపట్టవలసిందిగా కోరతున్నాను. చివరగా మా సొంత నియోజక వర్గానికి చెందినది. 220 కిలోవాట్ల సబ్‌స్టేషన్‌కు సంబంధించి సంవత్సరమున్నర నుంచి నేను శతధా పోరుతున్నాను. ఇంత వరకూ దాని పని ప్రారంభం కాలేదు. అక్కడ కోట్లాది రూపాయల రెవెన్యూ వస్తోంది. అధ్యక్షా, మీ ద్వారా గౌరవ ముఖ్యమంత్రి గారికి తెలియచేస్తున్నాను, అక్కడెవరన్నా బిల్లులు కట్టకపోతే విద్యుత్ అధికారులతో బిల్లు కట్టకపోతే మీరు విద్యుత్తును కట్ చేసేయండి, తప్పు చేస్తే శిక్షించండి అని నేనే చెబుతున్నాను. ఇల్లీగల్ కనెక్షన్లుంటే జైలుకు పంపించండి అని నేను చెబుతున్నాను. కానీ విద్యుత్తుకు మేము డబ్బులు కడుతున్నప్పుడు మాకెందుకు 220 కిలోవాట్ల సబ్‌స్టేషన్ ఇవ్వడంలేదు? ఎందుకని శాంక్షన్ ఉంది. ప్లాన్‌లో ఉందని చెబుతున్నారు. వెంటనే అది ప్రారంభం కావాలి. ఆరు నెలల్లో పని పూర్తి కావాలి. ఆ హామీ నిర్దిష్టంగా మంత్రి గారిని ఇవ్వవలసిందిగా కోరుతున్నాను. ■



# హక్కుల నేత బుర్రరాములు మృతికి లోక్‌సత్తా నివాళి

పౌరహక్కుల సంఘం నేత, రచయిత ప్రొఫెసర్ బుర్రరాములు గతకొన్ని నెలలుగా కాన్సర్ వ్యాధితో భాదపడుతూ మే 14న హన్మకొండలో ఒక ప్రయివేటే ఆసుపత్రిలో మరణించారు 1954 అక్టోబర్ 7న జిల్లా వరంగల్‌లో జన్మించిన ఆయన కాకతీయ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. పౌరహక్కులకు ఎక్కడ భంగం కలిగిన నిజనిర్ధారణ కమిటీ సభ్యులుగా పౌరహక్కుల పరిరక్షణ కార్యక్రమాలలో ప్రముఖ పాత్రవహించారు. లోక్‌సత్తాపార్టీ ఈ హక్కుల ఉద్యమ నేతకి నివాళులర్పిస్తుంది వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

# ఎంపీ లాడ్స్ అభివృద్ధికా ? అవినీతికా?

పార్లమెంటుసభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం (ఎంపీ లాడ్స్) రాష్ట్రంలో అమలు జరుగుతున్న తీరును 'కాగ్' తన తాజా నివేదికలో తీవ్రంగా విమర్శించింది. చేపట్టిన పనుల తనిఖీ లోపించిందని, మార్గదర్శకాలను పట్టించుకోవడం లేదని, నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు చేస్తున్నారని కాగ్ నివేదిక స్పష్టం చేసింది. పనులకు సంబంధించి ఇచ్చిన వివరాలు తప్పుల తడకలుగా ఉన్నాయని పేర్కొంది.

కాగ్ నివేదిక నేపథ్యంలో ఎంపీ లాడ్స్ మీద చర్చ సాగుతున్నది. దేశం సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో వున్నది. అధికారంలో ఏ ప్రభుత్వం వున్నా పార్లమెంటు సభ్యులను ప్రసన్నం చేసుకోవడం తప్పనిసరి అయింది. ఈ పరిస్థితిని అసరాగా చేసుకుని పార్లమెంటు సభ్యులు ఈ స్థానిక ప్రాంత అభివృద్ధి పథకాన్ని సాధించుకున్నారు. 1993 – 94లో కేవలం సంవత్సరానికి కేవలం 50 లక్షల రూపాయల కేటాయింపుతో ప్రారంభమైన ఈ పథకం 'ఇంతింతై వటుడింతై' అన్నట్లు తర్వాత సంవత్సరానికి 1 కోటి తర్వాత 2 కోట్లు ఇప్పుడు 2011-12 బడ్జెట్‌లో ప్రతి పార్లమెంటు సభ్యునికి సంవత్సరానికి 5 కోట్లు వంతున కేటాయింపులు పెంచుకున్నాయి.

ఈ సొమ్ముని లోక్‌సభ సభ్యులు తమ నియోజకవర్గం పరిధిలో ఎక్కడైనా వినియోగించుకునే వీలుంది. రాజ్యసభ సభ్యులు తాను ప్రాతినిధ్యం వహించే రాష్ట్రంలో ఎక్కడైనా వినియోగించుకునే వీలుంది.

పార్లమెంటు సభ్యులతో ప్రారంభమైన ఈ వ్యక్తిగత కేటాయింపుల జబ్బు రాష్ట్రాలలో శాసనసభ్యులకు అక్కడ నుండి అనధికారికంగా జిల్లా పరిషత్ సభ్యులకు మండల పరిషత్ సభ్యుల వరకూ పాకింది.

ఎంపీ లాడ్స్ వినియోగానికి కొన్ని మార్గదర్శకాలున్నా ఈ నిధులు పక్కదారి పట్టించడానికి అనేక మార్గాలు కూడా వున్నాయి. దానిని ఆసరాగా చేసుకుని కొందరు ఏంపీలు తమ బినామీ ట్రస్టులు, సొసైటీలకు నిధులు కేటాయిస్తున్నారు. ప్రయివేటు విద్యసంస్థలకి, ప్రయివేటు కమ్యూనిటీ హాళ్లకి

## మన ఎంపీలు ఖర్చు చేస్తున్న విధంబెట్టిదనిన...

- రాష్ట్రంలో లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు మొత్తం 60 మంది ఉన్నారు. ఎంపీ లాడ్స్ కింద ఒక్కొక్కరికే ఏడాదికి రూ రెండు కోట్ల చొప్పున అందేవి కేంద్ర ఆర్థికమంత్రి ఇటీవల బడ్జెట్ సమావేశాల్లో చేసిన ప్రకటన ప్రకారం ఇకనుంచి ఏడాదికి రూ.5 కోట్లు చొప్పున అందనున్నాయి.
- మన రాష్ట్రంలో ఎంపీల నిధులతో ఇప్పటిదాకా చేసిన ఖర్చు రూ.749 కోట్లు వీటితో 47.480 పనులు చేపట్టారు. వీటిలో రోడ్లు భవనాలు, కాలిబాటల వంటి నిర్మాణాలే ఎక్కువ ఉన్నట్లు వెల్లడైంది. రోడ్ల నిర్మాణాల్లో ఈ నిధులు దుర్వినియోగమవుతున్నాయంటూ ఇటీవలే కాగ్ వెల్లడించడం గమనార్హం.
- ఎంపీలు తమ నిధులతో చేపట్టిన మొత్తం పనుల్లో జాతీయ స్థాయిలో క్రీడలకు ఇచ్చిన ప్రాధాన్యం రెండు శాతం ఉండగా ఇక్కడి పరిస్థితి మరీ ఘోరంగా ఉంది.
- జాతీయ స్థాయిలో విద్యకు సంబంధించిన పనులు 15 శాతం కాగా, మన రాష్ట్ర ఎంపీలు 6 శాతంతో సరిపెట్టారు.
- వైద్యం, కుటుంబ సంక్షేమం, పశుసంవర్ధకం వంటి రంగాలపైనా ఎంపీలు ఆసక్తి కనబరచడంలేదని తేలింది.
- కేవలం రోడ్లు, భవనాలు, కాలిబాటల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మొత్తం పనుల్లో జాతీయ స్థాయిలో వీటికి 32 శాతం స్థానం దక్కగా రాష్ట్ర ఎంపీలు అంతకంటే ఎక్కువగా 33 శాతం ప్రాధాన్యమిచ్చారు.

నిధులను మళ్లిస్తున్నా కొందరు కమీషన్లు గుంజుకుంటున్నారు. తన అనుచరగణాన్ని కాంట్రాక్టర్లుగా ఏర్పాటు చేసుకుంటున్నారు. మొత్తంమీద అత్యధిక నిధులు ఎంపీల ఇష్టారాజ్యంగా ఖర్చు అవుతున్నాయి. అవసరాల ప్రాధాన్యత కంటే వ్యక్తుల ప్రాబల్యం మీద, స్వంత పలుకుబడి పెంచుకోవడం మీద ఈ నిధులు ఖర్చు అవుతున్నాయి. పర్సంటేజీలు దండిగా వచ్చే పనులకు నిధుల కేటాయింపులు జరిగిపోతున్నాయి. మొత్తంమీద అధికశాతం అవినీతికీ, అక్రమార్జనకీ నిలయం అవుతున్నాయి. ఇలా ప్రతి సంవత్సరం 4 వేల కోట్ల రూపాయలు ప్రణాళికలకు దూరంగా, ప్రాధాన్యతలు లేకుండా, బడ్జెట్‌లకు చిక్కకుండా ఖర్చు అవుతున్నాయి. కొందరు పార్లమెంటు సభ్యుల కమీషన్లకు అనుచరగణం కాంట్రాక్టులకు, ఓటర్ల ప్రలోభాలకు వినియోగం అవుతున్నాయి. ప్రణాళికా సంఘం ఇలాంటి కేటాయింపుల్ని వ్యతిరేకించింది. ఈ పనుల అమలు తీరును కాగ్ తప్పు పట్టింది. అయినా యీ పథకాన్ని కేవలం పార్లమెంటు సభ్యులను సంతృప్తిపర్చడానికి, వారు పరోక్షంగా ఎన్నికల నిధులను సమకూర్చుకోడానికి మాత్రమే వినియోగపడే రీతిలో అమలుపర్చడం ప్రజాధనాన్ని దుర్వినియోగపర్చడమే అవుతుంది.

అందుచేత నిజంగా నియోజకవర్గాల అభివృద్ధి కోసమే అయితే ప్రతి పార్లమెంటు సభ్యుడు తన నియోజకవర్గ అభివృద్ధికి నిర్దిష్టంగా ప్రణాళికను రూపొందించి సమర్పిస్తే దానిని మార్గదర్శకాలకు లోబడి మంజూరు చేసే పద్ధతి తేవాలి. ఈ పనులపై పర్యవేక్షణను కఠినతరం చెయ్యాలి. అంతేగాని ఏ ప్రణాళికా లేకుండా, ఏ పర్యవేక్షణా లేకుండా చేసే నిధులు సద్వినియోగం కావు.

**ఇంతవరకు చేపట్టిన పనుల్లో రాష్ట్ర ఎంపీల ప్రాధాన్యతలు ఇవీ (శాతాల్లో)**

| రంగం | రాష్ట్రంలో | జాతీయస్థాయిలో |
|---|---|---|
| రోడ్లు భవనాలు, కాలిబాటలు | 33 | 32 |
| ఇతర ప్రజాసౌకర్యాలు | 27 | 27 |
| మంచినీరు | 20 | 12 |
| విద్య | 6 | 15 |
| విద్యుత్తు | 6 | 4 |
| సాగునీరు | 4 | 2 |
| పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం | 2 | 4 |
| వైద్యం, కుటుంబసంక్షేమం | 1 | 1 |
| పశు సంవర్ధకం | 1 | 1 |
| సాంప్రదాయేతర | 0 | 0 |
| ఇందన వనరులు | | |
| క్రీడలు | 0 | 2 |

**ఎంపీలకు నిధుల పెంపు ఇలా (రూ॥కోట్లలో)**

| | |
|---|---|
| 1993-94 | 0.05 |
| 1994-95 నుంచి 1997-98 | 1.00 |
| 1998-99 నుంచి 2010-11 | 2.00 |
| 2011-12 నుంచి... | 5.00 |

## కాగ్ అక్షింతలు

**రాష్ట్రంలో ఎంపీలాడ్స్ అమలు తీరును 'కాగ్' తన తాజా నివేదికలో ఎండగట్టింది పనుల తనిఖీ కొరవడిందని మార్గదర్శకాలకు విరుద్ధంగా, నిధులను ఇష్టానుసారంగా ఖర్చు పెడుతున్నారని తేల్చింది. పనులకు సంబంధించి అందుబాటులో గల వివరాలు తప్పుల తడకలని కుండబద్దలు కొట్టింది. ముఖ్యంగా రోడ్ల నిర్మాణాల్లో నిధులు దుర్వినియోగమవుతున్నాయని విమర్శించింది.**

## మార్గదర్శకాల్లో మార్పులు

**ఎంపీ లాడ్స్ అమలుకు సంబంధించి త్వరలో కొత్త మార్గదర్శకాలు వెలువడనున్నాయి. వీటివల్ల నిధుల మంజూరులో ఎంపీలకు ఇప్పటికంటే వేసులుబాటు లభిస్తుంది. కొత్త మార్గదర్శకాల రూపకల్పనపై కేంద్రం ఈ మధ్యే అన్ని రాష్ట్రాలతోనూ సమావేశం నిర్వహించి చర్చించిందని, అవి త్వరలోనే వెలువడతాయని అధికార వర్గాలు తెలిపాయి.**

# రాష్ట్రంలో లోక్‌సభ సభ్యులు - ఎంపీ లాడ్స్ ఖర్చుల వివరాలు 2009-10 (కోట్లలో..)

| పేరు | విడుదలైన సొమ్ము (వడ్డీతోసహా) | ఖర్చు చేసిన సొమ్ము | ఖర్చు శాతం | ఖర్చు కాని మొత్తం |
|---|---|---|---|---|
| రాథోడ్ రమేష్<br>అదిలాబాద్ | 4.02 | 2.07 | 51.64 | 1.95 |
| జి.వి.హర్షకుమార్<br>అమలాపురం(ఎస్‌సి) | 3.00 | 0.95 | 31.61 | 2.05 |
| అనంతవెంకటరామిరెడ్డి<br>అనంతపురం | 3.03 | 1.59 | 53.11 | 1.43 |
| సబ్బం హరి<br>అనకాపల్లి | 3.00 | 1.03 | 34.42 | 1.97 |
| పనబాక లక్ష్మి<br>బాపట్ల | 3.01 | 0.67 | 22.45 | 2.34 |
| సురేష్ కుమార్ షెట్కా<br>జహీరాబాద్ | 4.01 | 2.87 | 71.72 | 1.14 |
| సర్వే సత్యనారాయణ<br>మల్కాజ్‌గిరి | 3.04 | 0.89 | 29.50 | 2.16 |
| ఎన్. శివప్రసాద్<br>చిత్తూరు | 3.08 | 1.70 | 56.55 | 1.39 |
| వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి<br>కడప | 3.03 | 1.78 | 59.25 | 1.25 |
| కె. సాంబశివరావు<br>ఏలూరు | 4.00 | 2.08 | 51.96 | 1.92 |
| ఆర్. సాంబశివరావు<br>గుంటూరు | 3.00 | 0.67 | 22.45 | 2.33 |
| జైపాల్ రెడ్డి సిదిని<br>చేవెళ్ళ | 3.04 | 0.77 | 25.53 | 2.27 |
| నిమ్మల క్రిష్టప్ప<br>హిందూపురం | 4.04 | 3.25 | 81.23 | 0.79 |
| అసదుద్దీన్ ఒవైసి<br>హైదరాబాద్ | 3.00 | 0.89 | 29.81 | 2.11 |
| ఎమ్.ఎమ్.పళ్ళం రాజు<br>కాకినాడ | 3.00 | 0.61 | 20.23 | 2.39 |
| పొన్నంప్రభాకర్<br>కరీంనగర్ | 3.02 | 1.85 | 61.82 | 1.16 |
| నామ నాగేశ్వరరావు<br>ఖమ్మం | 4.03 | 3.23 | 80.71 | 0.80 |
| కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి<br>కర్నూల్ | 3.02 | 1.70 | 56.71 | 1.32 |
| కె. నారాయణరావు<br>మచిలీపట్నం | 3.00 | 0.91 | 30.48 | 2.09 |
| కె.చంద్రశేఖర్ రావు<br>మహబూబ్‌నగర్ | 3.01 | 0.71 | 23.50 | 2.30 |
| ఎమ్.విజయశాంతి<br>మెదక్ | 4.01 | 2.55 | 63.78 | 1.46 |
| కె. రాజగోపాల్‌రెడ్డి<br>భువనగిరి | 4.04 | 2.65 | 66.32 | 1.39 |
| మంద జగన్నాథం<br>నాగర్ కర్నూల్ (ఎస్.సి) | 4.00 | 1.48 | 36.98 | 2.52 |
| సుఖేందర్ రెడ్డి గుత్తా<br>నల్గొండ | 4.04 | 2.30 | 57.62 | 1.74 |
| ఎస్.పి.వై. రెడ్డి<br>నంద్యాల | 3.02 | 0.45 | 15.00 | 2.57 |
| మోదుగులవేణుగోపాల్‌రెడ్డి<br>నర్సారావుపేట్ | 3.00 | 1.28 | 42.51 | 1.72 |
| బాపిరాజు కానుమూరి<br>నర్సాపురం | 4.00 | 2.62 | 65.51 | 1.38 |
| మేకపాటి రాజమోహన్‌రెడ్డి<br>నెల్లూరు (ఎస్.సి) | 3.01 | 1.05 | 35.07 | 1.96 |
| మధుగౌడ్ యాష్కి<br>నిజామాబాద్ | 3.01 | 1.05 | 35.07 | 1.96 |
| మాగుంట శ్రీనివాసులురెడ్డి<br>ఒంగోలు | 3.02 | 1.52 | 50.70 | 1.50 |
| పోరిక నాయక్ బాల్‌రామ్<br>మహబూబాబాద్(ఎస్.టి) | 3.00 | 2.50 | 83.38 | 0.50 |
| గడ్డల వివేకానంద<br>పెద్దపల్లి (ఎస్.సి) | 3.02 | 1.61 | 53.68 | 1.41 |
| అరుణకుమార్ ఉండవల్లి<br>రాజమండ్రి | 3.00 | 1.58 | 52.67 | 1.42 |
| అన్నయ్యగారి సాయిప్రతాప్<br>రాజంపేట్ | 4.02 | 2.68 | 67.12 | 1.34 |
| ఎమ్.అంజన్ కుమార్‌యాదవ్<br>సికింద్రాబాద్ | 4.01 | 2.03 | 50.73 | 1.98 |
| వి.కిషోర్ చంద్రదేవ్<br>అరకు (ఎస్.టి) | 3.08 | 1.79 | 59.53 | 1.29 |
| కృపారాణి కిల్లి<br>శ్రీకాకుళం | 4.00 | 2.27 | 56.76 | 1.73 |
| ఝాన్సీలక్ష్మీ బొత్స<br>విజయనగరం | 4.04 | 3.07 | 76.67 | 0.97 |
| చింతామోహన్<br>తిరుపతి(ఎస్.సి) | 3.07 | 1.16 | 38.79 | 1.91 |
| రాజగోపాల్ లగడపాటి<br>విజయవాడ | 3.01 | 1.21 | 40.43 | 1.80 |
| దగ్గుపాటి పురంధరేశ్వరి<br>విశాఖపట్నం | 3.00 | 1.29 | 34.13 | 1.71 |
| రాజయ్య సిరిసిల్ల<br>వరంగల్ (ఎస్.సి) | 3.00 | 1.15 | 38.34 | 1.85 |
| మొత్తం | 140.58 | 69.03 | 49.31 | 71.75 |

# భారత్ – చైనా జీవన నాణ్యతలో వ్యత్యాసాలు



అమర్త్యసేన్

భారత్, చైనా దేశాలు త్వరితగతిన ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నాయి. కాని జీవన ప్రమాణాల విషయంలో ఈ రెండు దేశాలకు మధ్య వ్యత్యాసాలు అపారంగానే ఉన్నాయి. భారత ఆర్థికవృద్ధిరేటు క్రమంగా పెరుగుతోంది. అది ఎనిమిది శాతం దాకా ఉంది. ఈ సంవత్సరంలో తొమ్మిది శాతం దాకా వుంటుందని అంచనా. చైనా వార్షిక వృద్ధిరేటు పదిశాతం ఉంది. మనం చైనా వృద్ధిరేటును అధిగమించగలమా, ఒకవేళ సాధ్యం అయితే ఎప్పుడు అన్న చర్చ జరుగుతోంది. మన దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఈ అంశం చర్చకు వస్తూనే ఉంది. అయితే విద్య, మౌలిక ఆరోగ్యం, ఆయుఃప్రమాణాలు వంటి విషయాల్లో చైనాతో పోల్చినప్పుడు మన పరిస్థితి ఏమిటో బేరీజు వేసుకోకుండా మనం చైనాను అధిగమించగలమా అని చర్చించడం దండగ. ఆర్థికవృద్ధి జీవన ప్రమాణాలను పెంచడంలో, పేదరికాన్ని కట్టడి చేయడంలో చాలా బాగా తోడ్పడుతుందనడంలో సందేహం లేదు. అయితే స్థూల జాతీయ ఉత్పత్తిని మాత్రమే అంతిమం అని భావించినందువల్ల ప్రయోజనం లేదు. ఈ వృద్ధి మనం ఎంతో ప్రధానమైన విలువలుగా భావించే వాటి సాధనకు ఉప కరించినప్పుడే సార్థకత.

ఆర్థికవృద్ధి మన జీవన ప్రమాణాలను పెంచుతుంది అనుకున్నప్పుడు ఈ తేడా గమనించడం వల్ల వచ్చే మార్పు ఏమిటీ అని ప్రశ్నించవచ్చు. ఆర్థికవృద్ధి జీవన స్థితిగతులను మెరుగు పరచడానికి తోడ్పడే మాట వాస్తవమే. కాని అయితే పెరిగిన ఆదాయాన్ని మనం ఎలా వినియోగిస్తాం అనేదాన్ని బట్టి ఆ వృద్ధి ఫలితాలు ఎవరికి అందుతాయి, దాని ప్రభావం ఎలా ఉంటుంది అన్నది ఆధారపడి ఉంటుంది. ఆర్థిక వృద్ధికి, జీవన ప్రమాణాల పెరుగుదలకు మధ్య సంబంధానికి అనేక కారణాలు ఉంటాయి. ఆర్థిక, సామాజిక అసమానతలు కూడా కారణం అవుతాయి. అంతేగాకుండా ఆర్థికవృద్ధి వల్ల సమకూరిన ఆదాయాన్ని ప్రభుత్వం ఎలా వినియోగిస్తోంది అన్నది కూడా ముఖ్యమైన అంశమే.

## అంతర్జాతీయ విశేషాలు

చైనాకు, భారత్‌కు సంబంధించిన కొన్ని గణాంకాలను పరిశీలిద్దాం. ఈ గణాంకాలు ప్రపంచ బ్యాంకు, ఐక్యరాజ్యసమితి తయారుచేసినవే. పుట్టిన శిశువు ఆయుఃప్రమాణం చైనాలో 73.5 సంవత్సరాల భారత్‌లో అది 64.4 సంవత్సరాలు మాత్రమే. భారత్‌లో పుట్టిన ప్రతి వెయ్యి మందిలో 50 మంది పుట్టగానే మరణిస్తున్నారు. చైనాలో అలా మరణిస్తున్న శిశువులు ప్రతి వెయ్యి మందికి 19 మంది మాత్రమే. భారత్‌లో ఒక లక్ష మంది స్త్రీలు ప్రసవిస్తే 230 మంది ప్రసూతి సమయంలోనే మరణిస్తున్నారు. ఈ సంఖ్య చైనాలో ప్రతి లక్ష మందికి 38 మాత్రమే. మనదేశంలో సగటున పిల్లలు బడికి వెళ్ళగలిగేది. 4.4 ఏళ్ళు అయితే చైనాలో అది 7.5 ఏళ్లు. వయోజనులైన వారిలో నూటికి 94 మంది అక్షరాస్యులు అయితే మనదేశంలో నూటికి 74 మంది వయోజనులు మాత్రమే అక్షరాస్యులు.

బాలికలకు విద్య గరపడం కోసం మనం చేసిన ప్రయత్నం

వల్ల 15 మంది 24 ఏళ్ళ మధ్య ఉన్న స్త్రీలు బడికి వెళ్ళడం పెరిగింది. అయినా ఈ సంఖ్య 30 శాతం మించడం లేదు. అదే చైనాలో అయితే 99 శాతం మంది బాలికలు బడికెళు తున్నారు. మనదేశంలో అనేక మంది బాలలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఇది మన ఘోరవైఫల్యం కిందే లెక్క. చైనాలో పోషకాహార లోపం ఉన్న వారి సంఖ్య చాలా తక్కువ. డిప్తీరియా, కోరింత దగ్గు, ధనుర్వాతం రాకుండా 66 శాతం మంది బాలలకు మాత్రమే మనదేశంలో టీకా మందులు వేయించగలగుతున్నాం. చైనాలో అయితే 97 శాతం మంది పిల్లలకు ఈ వ్యాధులు రాకుండా టీకా మందులు వేయిస్తున్నారు.

కేవలం భారత - చైనా దేశాల మధ్య స్థూల జాతీయ ఉత్పత్తిని మాత్రమే పోల్చిచూడడానికి బదులు ఇలాంటి ప్రమాణాలను బేరీజు వేసి చూడడం వల్ల ఎలాంటి విధానాలు మెరుగ్గా ఉంటాయో తెల్చుకోవడానికి ఉపయోగపడుతుంది. విద్య, ఆరోగ్యం వంటి సామాజిక లక్ష్యాల కోసం ఎక్కువ శ్రద్ధ తీసుకుంటే మనదేశంలో ఆర్థిక వృద్ధి రేటు మందగించే ప్రమాదం ఉందన్న వాదనలు ఉన్నాయి. అందుకే ఈ సామాజిక లక్ష్యాల గురించి ఆలోచించకుండా వృద్ధిరేటు మీద దృష్టి నింపాలని వాదించే వారూ ఉన్నారు.

చైనాలో స్థూల జాతీయ వృద్ధి రేటు మనకన్నా ఎక్కువే. దీనివల్ల చైనా పేదరికాన్ని తగ్గించే అనేక సూచికల విషయంలో మెరుగైన ఫలితాలు సాధించగలిగింది. జీవన నాణ్యతను మెరుగుపరచడానికి కృషి చేయగలుగుతోంది. మనదేశంలో జీవన ప్రమాణాలను వర్తమానంలోనూ, భవిష్యత్తులోనూ పెంపొందించడం మీద దృష్టి కేంద్రీకరించాలని అనుకోవడంలో తప్పు లేదు. నిలకడగా కొనసాగే వృద్ధిరేటు మంచిదే కాని అది కేవలం వృద్ధిరేటు వ్యామోహం అయితే మాత్రం ప్రమాదకరమే.

కేవలం స్థూల జాతీయ ఉత్పత్తిలో పెరుగుదల రేటు మాత్రమే మన జీవిత నాణ్యతకు సూచిక కాదు. జీవిత నాణ్యత ఎలా ఉంది అని గమనించాలంటే మనం సాధిస్తున్న, విఫలమవుతున్న ఇతర అంశాలు ఏమిటో కూడా గమనించాలి. బంగ్లాదేశ్ ఉదంతాన్నే పరిశీలిద్దాం. ఆదాయాల దగ్గరకొస్తే బంగ్లాదేశ్ కన్నా మనం చాలా ముందున్నాం. కొనుగోలు శక్తి ఆధారంగా చూస్తే భారత్‌లో తలసరి స్థూల జాతీయ ఉత్పత్తి 1,170 డాలర్లు అయితే బంగాదేశ్‌లో అది కేవలం 590 డాలర్లే ఉంది. ఇటీవల భారత్ అధిక ఆర్థిక వృద్ధిరేటు సాధించినందువల్ల భారత్-బంగ్లాదేశ్ మధ్య ఈ వ్యత్యాసం మరింత పెరిగింది. ఇది మనకు అనుకూలమైన అంశమే. ఐక్యరాజ్యసమితి రూపొందించే మానవాభివృద్ధి సూచికలో కూడా మనం బంగ్లాదేశ్ కన్నా చాలా ముందున్నాం. అయితే ఇతర అంశాలలో కూడా ఈ ఆర్థిక వృద్ధి ఎంతవరకు తోడ్పడింది అని ఆలోచిస్తే వచ్చే సమాధానం నిరాశనే మిగిలుస్తోంది.

బంగాదేశ్‌లో ఆయుఃప్రమాణం 66.9 సంవత్సరాలు అయితే మనదేశంలో 64.4 సంవత్సరాలు. తక్కువ బరువుతో పుట్టే పిల్లల మనదేశంలో నూటికి 43.5 మంది అయితే బంగ్లాదేశ్‌లో 41.3 శాతం మాత్రమే. బంగ్లాదేశ్ బాలలు సగటున బడికి వెళ్ళేది 4.8 సంవత్సరాలు అయితే మనదేశంలో అది 4.4 ఏళ్ళు మాత్రమే. 15 నుంచి 24 ఏళ్ళ మధ్య ఉన్న పురుషుల అక్షరాస్యతలో మనం బంగ్లాదేశ్ కన్నా ముందున్నాం కాని అదే వయసు గల మహిళల్లో బంగ్లాదేశ్ పరిస్థితి మనకన్నా మెరుగ్గా ఉంది.

ఆరోగ్యం విషయంలో ఈ రెండు దేశాల మధ్య పోలిక ఎలా ఉందో చూద్దాం. అయిదేళ్ళ లోపు శిశు మరణాల సంఖ్య మనదేశంలో వెయ్యికి 66 అయితే బంగ్లాదేశ్ లో అది కేవలం 52 శిశు మరణాల విషయంలో కూడా బంగ్లదేశ్ మనకన్నా మెరుగ్గా ఉంది. బంగ్లాదేశ్‌లో నూటికి 94 మంది డిపిటి టీకాలు వేయిస్తే మనదేశంలో నూటికి 66 శాతం మంది బాలలకు మాత్రమే ఆ టీకాలు వేయించగలగుతున్నాం. మన తలసరి ఆదాయంలో బంగ్లా ప్రజల తలసరి ఆదాయం సగం కూడా లేనప్పుడే అనేక ప్రమాణాల విషయంలో ఆ దేశం మనకన్నా మెరుగ్గా ఉంది. ఆదాయం తక్కువ అయినా బంగ్లాదేశ్ త్వరితగతిన ఈ ప్రమాణాలు సాధించగలిగింది. బంగ్లాదేశ్‌లోని స్వచ్ఛంద సంస్థల, గ్రామీణ బ్యాంకుల పనితీరు. పేదరిక నిర్మూలన కోసం చేపట్టిన చర్యల వల్ల మనకన్నా ఎక్కువ సత్ఫలితాలు సాధించగలిగింది. కాని ఆ దేశ ప్రజల ఆదాయం మరింత ఎక్కువ అయి ఉంటే ఇంకా మెరుగైన ఫలితాలు సాధించి ఉండేది.

ఆర్థిక వృద్ధి వల్ల ప్రభుత్వ వనరులు పెరుగుతాయి. వాటిని ప్రాధాన్య రంగాల కోసం ఖర్చు పెట్టవచ్చు. వాస్తవానికి ప్రభుత్వం వనరులు స్థూలజాతీయ ఉత్పత్తికన్నా త్వరితంగా పెరుగుతాయి. ఉదాహరణకు భారత ప్రభుత్వ స్థూల పన్నుల రాబడి 20 ఏళ్ళ కిందటితో అంటే 1990-91తో పోల్చుకుంటే నాలుగు రెట్లు పెరిగింది. ఇది స్థూల జాతీయ ఉత్పత్తిలో పెరుగుదల కన్నా చాలా ఎక్కువ.

ఆరోగ్యం, విద్య, పోషకాహారం వంటి వాటికి ఖర్చు చేసే

మొత్తం అంటే సామాజిక రంగంలో పెట్టే ఖర్చు మన దేశంలో పెరిగిన మాట నిజమే. అయినా ఈ విషయంలో మనం చైనా కన్నా వెనుకబడే ఉన్నాం. ఉదాహరణకు ఆరోగ్యరంగంలో చైనా మనకన్నా అయిదు రెట్లు ఎక్కువ ఖర్చు పెడుతోంది. అయితే చైనా జనాభా, తలసరి ఆదాయం మనకన్నా ఎక్కువ అన్నమాట కూడా వాస్తవమే. ఆరోగ్యరంగంలో చైనా తన స్థూల జాతీయ ఉత్పత్తిలో 2 శాతం ఖర్చు చేస్తే మనం కేవలం 1.1 శాతం మాత్రమే వెచ్చిస్తున్నాం.

ప్రజారోగ్యం మీద మనదేశంలో ప్రభుత్వం తక్కువ ఖర్చు పెడుతున్నందువల్ల ప్రజలు ప్రైవేట్ వైద్యుల మీద ఆధారపడాల్సివస్తోంది. డాక్టర్లు ఎలాంటి వైద్యం చేస్తున్నారో ప్రజలకు తెలియదు. కనుక మోసపోయే అవకాశం కూడా ఎక్కువే. నేను నెలకొల్పిన ప్రతీచి ట్రస్ట్ ఆధ్వర్యంలో 1999లో ఒక సర్వే చేశాం. రోగులకు చేయని చికిత్సకు కూడా వారి దగ్గర డబ్బు వసూలు చేసినట్టు ఈ అధ్యయనంలో తేలింది. ఇది సిగ్గుమాలిన దోపిడీ మాత్రమే కాదు, ప్రజారోగ్యం అందుబాటులో లేకపోవడానికి కూడా నిదర్శనం. ఆర్థిక వృద్ధి వల్ల ఏం ప్రయోజనం కలుగుతుందో గమనించాలంటే ఆర్థికవృద్ధి వల్ల సమకూరు వనరులను ఎలా వినియోగిస్తున్నారో కూడా పరిశీలించాలి.

ఆర్థిక వృద్ధి ప్రభావాన్ని చైనాతో పోల్చి చూసినప్పుడు భారత్ కన్నా చైనా మెరుగైన స్థితిలో ఉంది. అయితే భారత్ - చైనాల మధ్య పోలిక చాలా సందర్భంలో ఆర్థికవృద్ధితో మాత్రమే సంబంధం ఉన్నది కాదు. మనదేశంలో ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థ చాల వరకు ప్రజలకు సంతృప్తికరంగా ఉంది. అనేక రాజకీయ పార్టీలున్నా ఒక పద్ధతి ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తున్నాయి. పత్రికలు, ప్రసార సాధనాల మీద నియంత్రణ లేదు. మనకు భావప్రకటన స్వేచ్ఛ ఉంది. న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరిస్తుంది. ఇవన్నీ ప్రజాస్వామ్యం సచేతనంగా ఉందనడానికి నిదర్శనాలే. ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో లోపాలను ఎత్తిచూపేవారు లేకపోలేదు. నేనూ ఆ పనే చేస్తాను. కాని చైనాతో సహా ఇతర దేశాల ప్రజాస్వామ్య వ్యవస్థలు ఎలా ఉన్నాయో పోల్చి చూడాలి.

మనదేశంలో ఇంటర్నెట్ వాడకంపై ఎలాంటి నియంత్రణా లేదు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భావాలను మనం యధేచ్ఛగా తెలుసుకోవచ్చు. మన పత్రికలు విభిన్నమైన దృక్కోణాలు అనుసరిస్తాయి. ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తాయి. మనదేశంలో అమ్ముడైనన్ని పత్రికలు మరే దేశంలోనూ అమ్ముడు పోవు ఈ పత్రికల్లో విభిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం అవుతుంటాయి. ఆర్థిక వృద్ధి తోడ్పడిన మాట నిజమే. దానివల్ల చాలా అభివృద్ధి సాధ్యమైంది అన్నది కూడా వాస్తవమే. దానివల్లే దేశవ్యాప్తంగా రేడియోలు, టీవీలు విస్తారంగా అందుబాటులోకి వచ్చాయి. గ్రామీణ ప్రాంతాల వారికి కూడా అవి అందుబాటులో ఉన్నాయి. మనదేశంలో కనీసం 360 స్వతంత్రమైన టీవీ కేంద్రాలు ఉన్నాయి. మరెన్నో కొత్త కేంద్రాల ఏర్పాటుకు లైసెన్సులు మంజూరు చేశారు. అవన్నీ వైవిధ్యభరితమైన అభిప్రాయాలను వ్యక్త చేస్తాయి. వీటిలో 200 టీవీ కేంద్రాలు వార్తలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాయి. వీటిలో చాలా టీవీ కేంద్రాలు దివారాత్రాలు, వార్తాప్రసారాలు చేస్తాయి. చైనాలో టీవీ కార్యక్రమాలు చాలా వరకు ఒకే మూసలో ఉంటాయి. వైవిధ్యం చాలా తక్కువ. వివిధ ఛానళ్ళ మధ్య పెద్ద తేడా కనిపించదు.

ప్రజాస్వామ్య రాజకీయాల్లో స్వేచ్ఛకు ప్రాధాన్యత ఉంటుంది. దానిని ప్రజలు ఆస్వాదిస్తారు కూడా. మనదేశంలో చాలా పేదరికంలో ఉన్న ప్రాంతాల వారు కూడా సామాజిక రాజకీయ జీవితంలో పాలు పంచుకుంటారు. విచారణ, శిక్షలు విధించడంలో కూడా, కడకు మరణ శిక్షణ విధించడంలో కూడా చైనాతో పోలిస్తే మనదేశంలో పరిస్థితి మెరుగ్గా ఉంది. చైనాలో ప్రతివారం అనేక ఉరిశిక్షలు అమలు అవుతుంటాయి. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ అమలు అయినన్ని ఉరిశిక్షలు అక్కడ ఒక వారంలోనే అమలు కావచ్చు. భారత్ - చైనా దేశాల మధ్య జీవిత నాణ్యతను పోల్చి చూడదలచుకుంటే సాంప్రదాయకమైన సామాజిక సూచికలకు అతీతంగా చూడాల్సిన అవసరం ఉంది. ఆ రకంగా చూస్తే చైనా కన్నా మనదేశంలో పరిస్థితే మెరుగ్గా ఉంది.

మనదేశంలో అమలులో ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థ, ఆరోగ్యం, విద్యవంటి సామాజిక పరిస్థితులను మెరుగుపరచడానికి అడ్డంకిగా ఉందనుకోవాలా? కచ్చితంగా కాదు. 1980 వరకు మనదేశంలో ఆర్థికవృద్ధి చాలా మందకొడిగా సాగింది. ప్రజాస్వామ్యం ఆర్థికవృద్ధికి ఆటంకంగా ఉందని కూడా భావించేవారు. అభివృద్ధి త్వరితగతిన సాగాలంటే కఠినమైన రాజకీయ నియంత్రణ కన్నా ఆర్థిక పరిస్థితి అభివృద్ధికి అనుకూలంగా ఉండాలని ప్రజాస్వామ్య వ్యతిరేకులకు నచ్చచెప్పడం కష్టంగా ఉండేది. ప్రజాస్వామ్య వ్యవస్థ ఆర్థిక వృద్ధికి ఆటంకంగా ఉండనవసరం లేదు. ఈ చర్చ ఇంకా ముగియలేదు. మనదేశంలో ఆర్థికవృద్ధి రేటు

అధికంగా ఉన్నా ఈ వాదోపవాదాలు మాత్రం ఆగడం లేదు .

ఏ సామాజిక పరిస్థితులు రాజకీయ అంశాలు అవుతాయి అన్న అంశం మీదే ప్రజాస్వామ్య వ్యవస్థ ఏం సాధిస్తుందన్న విషయం ఆధారపడి ఉంటుంది. కొన్ని అంశాలు వెంటనే ప్రధానాంశాలు అయిపోతాయి. కరువులాంటివి ఇలాంటివే. మిగతా అంశాలు సవాళ్ళుగా మిగిలిపోతాయి. అంత తీవ్రంగా లేని పోషకాహారలోపం, లేదా స్త్రీ, పురుషుల మధ్య వత్యాసాలు, అందరికీ ఆరోగ్య సదుపాయాలు కొరవడడం వంటి వాటిని ప్రజాస్వామ్య వ్యవస్థ పరిష్కరించడం కష్టసాధ్యంగా మారుతుంది.

ప్రజాస్వామ్యాన్ని ఏ మేరకు ఆచరిస్తున్నాం అన్న విషయంపై విజయమో, అపజయమో ఆధారపడి ఉంటుంది. ఇటీవల కాలంలో ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోనడంలో భారత ప్రజాస్వామ్యం గణనీయమైన విజయాలు సాధించింది. స్త్రీ పురుషుల సమానత్వం, పాఠశాలల కొరత, విస్తృతంగా ఉన్న పోషకాహార లోపం వంటి సమస్యలను చాలా వరకు సమర్థంగా ఎదుర్కొగలిగాం. ప్రజల నిరసనలు,న్యాయస్థానాల తీర్పులు, సమాచారహక్కు చట్టం వంటి వాటి ప్రభావం ఎక్కువగా ఉంది. కాని వివిధ సమస్యలను పరిష్కరించడానికి చేయాల్సింది చాలా ఉంది.

చైనాలో మనం అనుసరించే విధానాలకు విరుద్ధమైన పద్ధతులను అనుసరిస్తారు. పార్టీ అగ్ర నాయకులే నిర్ణయాలు తీసుకుంటారు. ప్రజాస్వామ్య లక్షణం గల ఒత్తిడి ఉండదు. చైనా నాయకులకు బహుళ పార్టీ ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజకీయ స్వేచ్ఛ మొదలైన విషయాలపై విశ్వాసం లేకపోయినా వారు పేదరికం, పోషకాహారలోపం, నిరక్షరాస్యత వంటి వాటిని నిర్మూలించడానికి అందరికీ ఆరోగ్య సదుపాయాలు కల్పించడానికి కట్టుబడి ఉన్నారు.

అందువల్ల అక్కడ గణనీయమైన అభివృద్ధి సాధ్యమైంది. అయితే నియంతృత్వం అమలులో ఉన్న చోట తప్పులు దిద్దుకోవడానికి తక్కువ అవకాశం ఉంటుంది. ప్రభుత్వంలో ఉన్న వారు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తారు.

1959-1962 మధ్య చైనాలో కరువు వచ్చినప్పుడు ఇలాగే జరిగింది. అప్పుడు మూడు కోట్ల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వం అనుసరించే విధానాలను మార్చడానికి ప్రజలు ఒత్తిడి చేయలేకపోయారు. లక్షలాది మంది మరణిస్తున్నా మూడేళ్ళపాటు లోపభూయిష్టమైన విధానాలనే అమలు చేశారు. 1979లో చైనాలో అమలు చేసిన ఆర్థిక సంస్కరణల వల్ల వ్యవసాయ, పారిశ్రామిక రంగాల సామర్థ్యం పెరిగింది. కాని ప్రజారోగ్య సదుపాయాన్ని చైనా తొలగించింది. ప్రజలు ఆరోగ్యబీమా పథకాల కోసం ప్రయత్నించవలసి వచ్చింది. అనేక మందికి ఆరోగ్య భద్రత లేకుండా పోయింది. అదే ప్రజాస్వామ్య వ్యవస్థ అయి ఉంటే ఇలా జరిగేది కాదు. దీనివల్ల చైనాలో ఆయుఃప్రమాణాలు బాగా తగ్గిపోయాయి.

చైనా నాయకులు ఈ లోపాలు గుర్తించారు. అందుకని 2004 నుంచి మళ్ళీ ఆరోగ్య సదుపాయం పొందే హక్కును పునరుద్ధరించారు. మనకన్నా అక్కడి ప్రజలకు ఇప్పుడు ఆరోగ్య సదుపాయాలు ఎక్కువగా అందుబాటులో ఉన్నాయి.

మనదేశంలో జనాభాలో కొద్దిమంది ఆర్థికవృద్ధి వల్ల ప్రయోజనం పొందారు. వీరు జనాభాలో చూస్తే కొద్దిమంది అయినా వారి సంఖ్య తక్కువమీ కాదు. వారికి సామాజిక సహాయం అవసరం లేకుండా పోయింది. సంపన్నులైన వారు కొద్దిమందే అయినా వారి జీవనశైలి మెరుగు పడింది. తద్వారా సాహిత్యం, సంగీతం, నాటకరంగం, చిత్రకళ వంటి అనేక సాంస్కృతిక అంశాలు చాలా మెరుగుపడ్డాయి.

కాని ఆ కొద్దిమంది సంపన్నుల అభ్యున్నతి సాధారణ భారతీయుల జీవన శైలి కాదు. ఇలాంటి అదృష్టవంతుల్లో వ్యాపారస్థులు, వృత్తినిపుణులు, మేధావులు ఉన్నారు.

ఇలాంటి వారే వృద్ధి వల్ల అందరికీ ప్రయోజనం కలుగుతుందని వాదిస్తుంటారు.

సామాజిక అసమానతలను విమర్శించే వారు చాలామంది ఉన్నారు. కొద్ది మంది సంపన్నులైనప్పుడు సామాజికంగా వెనుబడిన వారి వ్యవహారం రాజకీయాల దృష్టిని ఆకర్షిస్తుంది. అప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ ఆధారంగా మనం ఏం చేయగలం అన్న ఆలోచన మొదలవుతుంది. అందుకే నిర్లక్ష్యానికి గురవుతున్న వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలి. ప్రభుత్వం విధానాల ద్వారా వారి స్థితిగతులను ఎలా మార్చాలో ఆలోచించాలి. భారత రాజకీయాల్లో ఇదే కీలకమైన అంశం.

కేవలం స్థూల జాతీయ ఉత్పత్తి పైనే దృష్టి కేంద్రీకరించడం వినాశనకరం. ప్రజల జీవితాలు మెరుగుపడడానికి ఆర్థిక వృద్ధి దోహదపడవచ్చు. కాని దానిమీదే దృష్టి కేంద్రీకరించడం వల్ల ప్రయోజనం లేదు అని గుర్తించాలి. ■

# బియ్యం ఎగుమతికి ఇంకెప్పుడు అనుమతి?

- ఎన్. విజయ్‌కుమార్

ఈ ఏడాది పారిశ్రామికవృద్ధి 3.62 శాతానికి దిగజారింది. అయినా 5.4 శాతం వృద్ధితో వ్యవసాయరంగం ప్రభుత్వాన్ని ఆదుకోనున్నదని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు మాంటెక్ సింగ్ అహ్లువాలియా అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాన్ని ఆదుకొంటున్న ఈ రంగం రైతుల్ని మాత్రం నిలువునా ముంచుతోంది. ముఖ్యంగా వరి, గోధుమ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీ ఇన్నీ కావు. పంటలతోపాటే వారి కష్టనష్టాలు ఈ ఏడాది రికార్డుస్థాయికి చేరుకున్నాయి. కుప్పలుగా పడి ఉన్న ధాన్యాన్ని అమ్ముకోవడమెలాగో తెలియక, ప్రభుత్వ సహాయం కోసం వారు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఉత్తరాదిలో గోధుమల సేకరణ మొదలైంది. గోదాములు ఖాళీ లేకపోవడంతో రబీ బియ్యం సేకరణపై మాత్రం నీలినీడలు కమ్ముకున్నాయి. గోదాములు పొంగిపొర్లుతున్నాయి. ప్రభుత్వ గిడ్డంగుల్లో ముఖ్యంగా తృణధాన్యాలు ముక్కిపోతున్నాయి. కావాల్సిన దాన్ని మించి పేరుకుపోయిన నిల్వల్ని వదిలించుకొని గోదాములు ఖాళీ చేయాలన్న ఆలోచనకాని, నిస్సహాయులైన రైతుల నుంచి మంచి ధరలకు ధాన్యం సేకరించాలన్న ఉద్దేశంకానీ విధానకర్తలకు ఉన్నట్లు కనిపించడం లేదు. అంతర్జాతీయస్థాయిలో ఆహారధాన్యాల ధరలు బాగా పెరిగిపోయాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఎగుమతుల ద్వారా అధిక ప్రయోజనం పొందే అవకాశాన్ని రైతులకు ఇవ్వకుండా భారతప్రభుత్వం నిర్లిప్తంగా వ్యవహరిస్తోంది. వ్యవసాయోత్పత్తుల ఎగుమతులపై ప్రభుత్వం కొన్నేళ్ళుగా అమలు పరుస్తున్న నిషేధం కారణంగా రైతులు మంచి ధరలు పొంది ఆదాయాలు పెంచుకొనలేక పోతున్నారు. వ్యవసాయరంగానికి సంబంధించి యథాప్రకారం విధానపరమైన మౌనం కొనసాగుతుంది.

### అవకతవక విధానాలు

మనదేశంలో ఈ ఏడాది ఆహార ధాన్యాల ఉత్పత్తి ఇదివరకెన్నడూ లేనంతగా 23,588 కోట్ల టన్నులకు చేరుకొనే అవకాశం ఉంది. గోధుమలు, పప్పు దినుసుల అత్యధిక దిగుబడులు ఇందుకు దోహదపడుతున్నాయి. 2010-11 లో 8.40 కోట్ల టన్నుల గోదాముల్లో 2.5 కోట్ల టన్నుల మేరకు ఆధార ధాన్యాల నిల్వ ఉండవచ్చు. కానీ మొన్న ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) వద్ద నిల్వ ఉన్న ఆహార ధాన్యాలు 4.7 కోట్ల టన్నులకు పైమాటే.

ఈ ఏడాది భారీయెత్తున ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నందుకు రైతులు సంతోషంగా ఉబ్బి తబ్బిబ్బు కావాలి. కానీ, పరిస్థితి అలా లేదు. వారు పెద్ద సంకటాన్నే ఎదుర్కొంటున్నారు. ఎఫ్‌సీఐ గోదాముల్లో జాగా లేదు. దాంతో, ప్రకటిత మద్దతు ధరలపై రైతుల నుంచి నిల్వలు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధపడటం లేదు. విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. బ్రహ్మాండమైన ధర లభిస్తుంది. అందువల్ల ధాన్యం ఎగుమతి చేసుకొందామంటే, ప్రభుత్వం అందుకూ రైతుల్ని అనుమతించడం లేదు. 2007లో గోధుమలు, 2008లో బియ్యం ఎగుమతిని నిషేధించిన ప్రభుత్వం, తమ ఉత్పత్తులు అమ్ముకోవడానికి రైతులకు ఇతర మార్కెటింగ్ మార్గాలు అందుబాటులోకి తెస్తోందా అంటే అదీలేదు. దాదాపు అన్ని దారుల్నీ అది మూసివేసింది. ఇక, ప్రభుత్వానికే అమ్ముకోవాలి. ధాన్యం సేకరణకు అదీ ముందుకు రావడం లేదు. ఇప్పుడు రైతులు ఏం చేయాలి?

ఆహార భద్రత కోసమే భారీయెత్తున ధాన్యాలు నిల్వ చేస్తున్నామన్న వాదనలో బలం లేదు. నిర్దిష్ట లక్ష్యాల ప్రకారం - ఏప్రిల్ ఒకటినాటికి 70 లక్షల టన్నుల గోధుమలు నిల్వ ఉంటే సరిపోతుంది. ఇప్పుడవి 1.54 కోట్ల టన్నులు. బియ్యం విషయంలోనూ అదే ధోరణి. 1.42 కోట్ల టన్నుల బియ్యం నిల్వలు చాలు. ఇప్పటికే అవి 2.88 కోట్ల టన్నులు దాటాయి. కొత్తగా మళ్ళీ ధాన్యం సేకరించాల్సి ఉంది. బియ్యం ఉత్పత్తి నిరుడు 8.9 కోట్ల టన్నులు కాగా, ఈ ఏడాది 9.4 కోట్ల టన్నులకు చేరుతోంది. గోధుమలు రికార్డుస్థాయిలో ఉత్పత్తి కానున్నాయి. ప్రభుత్వం వద్ద అవసరానికి మించి నిల్వ ఉన్న ఆహారధాన్యల విలువ దాదాపు రూ. 43,000 కోట్లు. దాన్ని ఏం చేసుకోవాలో ప్రభుత్వానికి పాలుపోవడం లేదు. తగినన్ని నిల్వ, రవాణా సదుపాయాలు లేవు. ఈ ఏడాది కొత్త ఉత్పత్తిని నిల్వ చేసే మార్గాలూ కనిపించడంలేదు.

మనరాష్ట్రంలో పరిస్థితీ దారుణంగానే ఉంది. ఎఫ్‌సీఐ ధాన్యం కొనుగోలు చేయడం లేదు.. దాంతో రైతులు చాలా ఇబ్బందిపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎఫ్‌సీఐ గోదాముల నిల్వ సామర్థ్యం 36 లక్షల టన్నులు. ఏప్రిల్ ఒకటినాటికే నిల్వలు దాదాపు 40 లక్షల టన్నులకు చేరుకొన్నాయి. ఈ ఏడాది రబీలో 67 లక్షల టన్నుల మేరకు ధాన్యాలు ఉత్పత్తి అవుతాయని

అంచనా. అదికాకుండా గత ఖరీఫ్‌లో అమ్ముడుకాని ధాన్యం దాదాపు 30 లక్షల టన్నులకు పైగా ఇప్పటికే రైతుల వద్ద ఉంది. అంటే, ఈ రబీ సీజన్ తరవాత రాష్ట్రంలో మొత్తం కోటీ 37 లక్షల టన్నుల ధాన్యం ఉంటుంది. అందులో లెవీకోసం ఎఫ్‌సీఐ 45 లక్షల టన్నుల మేరకు సేకరిస్తుంది. ప్రజాపంపిణీ వ్యవస్థ కోసం కాకుండా ఇతర అవసరాల కోసం ఎఫ్‌సీఐ 45 లక్షల టన్నుల మేరకు సేకరిస్తుంది. ప్రజాపంపిణీ వ్యవస్థ కోసం కాకుండా ఇతర అవసరాల కోసం మరో 20 లక్షల టన్నుల ధాన్యాలు పోతాయి. అప్పటికీ 70 లక్షల టన్నుల ధాన్యం నిల్వ ఉంటుంది. ఎఫ్‌సీఐ తదితర మార్కెటింగ్ సంస్థలు ప్రోత్సాహకర ధర ఇవ్వకపోవడం వల్ల గత ఖరీఫ్‌లో రైతులు అమ్ముకోని 30 లక్షల టన్నుల ధాన్యం ఉండనే ఉంది. దానిబట్టి రాష్ట్రంలో రైతుల వెతల్ని అర్థం చేసుకోవచ్చు.

బియ్యం గోధుమల నిల్వలు ఎక్కువగా ఉన్నప్పుడు విదేశాలకు ఎగుమతి చేసుకోవడానికి అనుమతించాలని రైతు సంఘాలు కొన్నేళ్లుగా కోరుతున్నాయి. ద్రవ్యోల్బణం బూచి చూపి ప్రభుత్వం అందుకు వెనకాలడుతోంది. ఆహార ధరోల్బణాన్ని నియంత్రించలేక ప్రభుత్వం బాధ్యతలు దులపరించేసుకొనే ప్రయత్నం చేస్తోంది. ఆహార ధరోల్బణానికి అసలు కారణం బియ్యం, గోధుమల కొరత కానేకాదని వేరే చెప్పనక్కర్లేదు. రెండు దశాబ్దాలుగా దేశంలో ఈ రెండు ఆహార ధాన్యాలకు ఏనాడూ కొరత ఏర్పడలేదు. పైగా, కుళ్లిపోయిన ధాన్యాల్ని భారత్ 2002లో సముద్రంలో పారేసింది.

ఆహార ధరోల్బణాన్ని కిందికి దించాలన్న చిత్తశుద్ధే ప్రభుత్వానికి ఉంటే కీలక ధాన్యాల ఉత్పత్తుల ఆధారంగా కార్యాచరణకు పూనుకోవాల్సి ఉంటుంది. కేవలం బియ్యం, గోధుమల మీదే దృష్టి కేంద్రీకరించడం సరికాదు. ఈ రెండు ధాన్యాల విషయంలో ఉత్పత్తులపరంగా కాకుండా సరఫరా, నిర్వహణ సంబంధ కారణాల వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. ఉత్పత్తులు పెంచరాదని ఎవరూ అనరు. కానీ, బియ్యం, గోధుమలకు మాత్రమే దాన్ని పరిమితం చేయరాదు. ఇతర ధాన్యాలు, వ్యవసాయోత్పత్తులకూ ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ ఆహార ధాన్యాల్ని అపరిమితంగా గోదాముల్లో నిల్వ ఉంచడం వల్ల నిల్వ వ్యయాలు పెరగడమే తప్ప ధరోల్బణం తగ్గే అవకాశాలు మాత్రం ఉండవు. ఆహార ధాన్యాలకన్నా, పప్పులు, పాలు, కూరగాయాల సరఫరాలో లోపాల కారణంగానే ధరోల్బణం బాగా పెరుగుతోంది. ధరోల్బణం ఇటీవలి ధోరణి చాటి చెబుతున్నదిదే. ప్రస్తుతం కీలకమైన ఈ అంశాన్ని విస్మరించి, ఏటా తప్పుడు దారిలోనే సాగిపోతుంది.

ఈ పరిస్థితుల్లో ఆహారధాన్యాల ఎగుమతికి అవకాశం ఇవ్వడం వల్ల రైతులకు మరింత మెరుగైన ప్రోత్సాహక ధరలు లభించడమే కాకుండా, కొత్తగా ధాన్యం సేకరణకు వీలుగా గోదాముల్లో తగినంత ఖాళీ ఏర్పడుతుంది. అంతర్జాతీయ మార్కెట్లల్లో అధిక ధరల ద్వారా ప్రయోజనం పొందడానికి కనీసం 30 నుంచి 40 లక్షల టన్నుల గోధుమలను అత్యంత ప్రోత్సహక ధరతో సునాయాసంగా ఎగుమతి చేసే అవకాశం ఉంది. దేశంలో గోధుమ ధర టన్నుకు 225 డాలర్లు ఉండగా, అనేక దేశాల్లో అది 360 నుంచి 380 డాలర్ల వరకు పలుకుతోంది. ఈ పరిస్థితుల్లో గోధుమల ఎగుమతికి అనుమతిస్తే రైతులకు మంచి లాభాలు వస్తాయి. దేశీయంగానూ రైతులకు సరైనా ధరలు లభిస్తాయి నానాటికీ పెరుగుతున్న వ్యయాల్ని తట్టుకొన గలుగుతారు. ముఖ్యంగా ఈజిప్టు, శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో గోధుమలకు చాలా డిమాండు ఉంది. ఇక బియ్యం విషయానికి వస్తే - ఈ ధాన్యం ఎగుమతి ద్వారా గోధుమలకన్నా ఎక్కువ లాభం పొందే అవకాశాలు మెండు. అంతర్జాతీయ ధరలతో పోలిస్తే భారత్‌లో బియ్యం ధరలు సగం లేదా మూడోవంతే. ఇలాంటప్పుడు బియ్యం ఎగుమతులూ అత్యంత ప్రయోజనదాయకమే.

### బహుళ ప్రయోజనకారి

ఎగుమతులతోపాటు ప్రస్తుత సమస్యకు చిర పరిష్కారం కోసం మరో ముఖ్యాంశాన్నీ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో ఆహారధాన్యాల కొనుగోలు, నిర్వహణలో ప్రైవేటురంగానికి చోటు కల్పించాలంటూ ఇటీవల వచ్చిన ప్రతిపాదనపై దృష్టి సారించాలి. నిల్వ రవాణా, నిర్వహణ వ్యయాలకు సంబంధించి సమస్యలు తలెత్తిన దరిమిలా సీఏసీపీ అధ్యక్షుడు అశోక్ గులాటీ ఈ మధ్య ఈ ప్రతిపాదన చేశారు. ఎగుమతులపై భారీగా లాభాలు ఉంటాయి కనుక, ఎగుమతి సుంకాన్ని వసూలుచేసినా పెద్దగా వ్యతిరేకత ఎదురుకాకపోవచ్చు విపత్తుల సహాయనిధిగా ఈ సుంకం డబ్బుల్ని వినియోగించుకోవచ్చు. ఆహార ధాన్యాల ఎగుమతి వల్ల దేశానికి విదేశీమారకద్రవ్యం రూపేణా ఏటా రూ. 12,000 కోట్ల మేరకు సమకూరగలదని అంచనా, ఇన్ని ప్రయోజనాలు ఉన్నప్పుడు - ఈ అంశంపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడంలో అర్థం లేదు. రైతులు పెట్టుకొన్న ఆశల్ని పాలకులు ఇప్పటికైనా నెరవేర్చాలి. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరచుకోవడం ద్వారా దేశ వ్యవసాయరంగానికి కొత్త దిశా, దశా కల్పించాలి. ■

(ఈనాడు సౌజన్యంతో...)

# స్వతంత్ర రైతు ఉద్యమానికి సారధ్య సంఘం

## స్వతంత్ర రైతు సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం

ధాన్యం రైతులకు మద్దతు ధర చెల్లించాలని స్వతంత్ర రైతు సంఘాలు ముక్తకంఠంతో డిమాండ్ చేశాయి. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రత్యక్ష ఆందోళనకు దిగాలని నిర్ణయించాయి. ఉద్యమ కార్యచరణ ఎలా ఉండాలనే అంశంపై చర్చించేందుకు సోమవారమిక్కడ లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ సారధ్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. "రైతులకు మద్దతు ధర చెల్లిస్తూ ధాన్యాన్ని ప్రభుత్వమైనా కొనాలి లేదా మిల్లర్లతోనైనా కొనిపించాలి" అనే ప్రధాన డిమాండ్‌తో ప్రత్యక్ష పోరాటానికి కదలకపోతే రైతులు సంక్షోభం నుంచి బయటపడలేరని రైతు సంఘాల నేతలు స్పష్టం చేశారు. ధాన్యం రైతులు ఎదుర్కొంటున్న మద్దతు ధర సమస్యను ప్రభుత్వం ముందుంచి, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించకపోతే, ప్రత్యక్ష ఆందోళనలకు దిగితే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ధాన్యం రైతులతోపాటు ఇతర వాణిజ్య పంటలకు కూడా లాభసాటి ధరలు కల్పించడం కోసం దీర్ఘకాలిక ఉద్యమాన్ని కొనసాగించాలని ఇంకొందరు నేతలు అన్నారు. అందరి అభిప్రాయాలను విన్న తర్వాత జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ ఆషామాషీగా కాకుండా ప్రభుత్వాలు కదలివచ్చేలా చిత్తశుద్ధితో గట్టిగా పోరాడదామని, దీర్ఘకాలిక పోరాటానికి ఇది పునాది కావాలని చెప్పారు. 2014 ఎన్నికల నాటికి రైతు సమస్యలే మౌలిక అంశం కావాలని, రాజకీయం వ్యవసాయం చుట్టూనే తిరగాలని జేపీ అన్నారు. ■

### సారధ్య సంఘం

రైతుల ఉద్యమాన్ని దీర్ఘకాలిక ప్రణాళికతో నిర్వహించటానికి తగిన నిర్ణయాలు తీసుకునేందుకు 15 మంది రైతు నాయకులతో సారధ్య సంఘాన్ని ప్రకటించారు.

ఈ సారధ్య సంఘానికి పి. భాస్కరరావు కన్వీనర్‌గా ఉంటారు. ఈ సారధ్య సంఘంలో వివిధ రైతు సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్. చెంగలరెడ్డి, వై. నాగేంద్రనాథ్, ఎ. ప్రభాకర రెడ్డి, బలరామి రెడ్డి, ఎస్.పి శంకర్ రెడ్డి, వై.పిచ్చయ్య యాదవ్, సిద్ధారెడ్డి, దశరథ రామిరెడ్డి, సత్యవాణి, కేశవరెడ్డి, నరసింహారెడ్డి, నాగిరెడ్డి, జి. నాగేశ్వర రాజు, అనుమోలు గాంధీ, గంగాధరరావులు సభ్యులుగా ఉంటారని జేపీ తెలిపారు.



రైతు సమస్యలపై హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్

# 2011 మే 10 స్పందించకపోతే ప్రత్యక్ష కార్యాచరణ ముఖ్యమంత్రికి స్పష్టం చేసిన సమాఖ్య

***డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆధ్వర్యంలో స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య సారధ్యసంఘ సభ్యులు మే 10వ తేదీన ముఖ్యమంత్రిని కలిసి రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ళకు ఐదు అంశాల కార్యక్రమాన్ని వివరించారు. ఈ అంశాలపై ప్రభుత్వం స్పందించకపోతే ప్రత్యక్ష కార్యాచరణ తప్పదని స్పష్టం చేశారు.***

1) ధాన్యం కొనుగోళ్లు పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాకీ రాష్ట్ర కార్యదర్శిస్థాయి ఐఏఎస్ అధికారిని తాత్కాలిక ప్రాతిపదికన నియమించాలి. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు, అత్యవసర సమయాల్లో ఎలాగైతే చేస్తారో అలాగే ఈ సమయంలో ఉన్నతాధికారి పర్యవేక్షణను ఏర్పాటు చేసి కొనుగోళ్లలో దోపిడీ, అక్రమాలు ఉంటే నిత్యావసర సరకుల చట్టం కింద కఠిన చర్యలు తీసుకునే అధికారాన్ని కల్పించాలి. ధాన్యం నిల్వలు బాగా ఉన్న 12,13 జిల్లాల్లో ఇలాంటి ఏర్పాట్లు అవసరం కావచ్చు.

2) ప్రతి జిల్లాలో ఉన్న ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షణకు రైతులతో కూడిన కమిటీల్ని ఏర్పాటు చేయాలి.

3) ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎవరు ఎంత అమ్మిందీ సమగ్ర వివరాలను రోజువారీ బైటపెట్టాలి. అలాగే జిల్లావారీగా మార్కెట్‌లో ఏ రేటుకి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారో రోజువారీగా వివరాలను సేకరించి, బహిరంగంగా ప్రకటించాలి.

4) ధాన్యం సేకరణకు గోనెసంచుల కొరత, రవాణా, పెట్టుబడి వంటి మౌలిక సదుపాయాల సమస్యలను అధిగమించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఎఫ్‌సిఐని సంప్రదించి రొటేషన్ పెట్టుబడిని సమకూర్చుకోవాలి. దాదాపు 70లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని స్థూల అంచనాలు పేర్కొంటున్నాయి. ఇందుకు కావలసిన గోనెసంచుల్ని, పెట్టుబడిని, రవాణా, నిల్వ ఏర్పాట్లని యుద్ధప్రాతిపదికన సమకూర్చుకోవాలి.

5) ధాన్యం ఎగుమతులకు ఎంపీలను ముఖ్యమంత్రి అధికారికంగా ఢిల్లీకి తీసుకెళ్లి ఒత్తిడి తేవాలి:

# 2011 మే 11 సమాఖ్యకు తొలి విజయం

***స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య డిమాండ్స్‌పై మే11న ముఖ్యమంత్రి స్పందించి జిల్లాలలో ధాన్యం కొనుగోళ్ళకు పదిమంది ప్రత్యేక అధికార్లను నియమించారు. గోనెసంచులు, గోదాములు, రవాణా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలను ప్రకటించారు.***

మద్దతు ధరకు ధాన్యాన్ని కొనడం కోసం చర్యలు తీసుకోవడానికి వీలుగా 10 జిల్లాలకు సీనియర్ ఐఏఎస్ అధికారుల్ని నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రస్థాయిలో రబీ ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించే బాధ్యతను మార్కెటింగ్, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి కె. రత్నకిషోర్‌కు అప్పగించారు. ధాన్యం కొనుగోళ్ల వ్యవహారంపై వ్యవసాయ శాఖ నుంచి లైజాన్ అధికారిగా ఏపీజెన్‌కో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి. ప్రభాకరరావు నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ అధికారి రైల్వే ర్యాకులు ఇతరత్రా వ్యవహారాల్ని పర్యవేక్షిస్తారు. జిల్లాల వారీగా పర్యవేక్షకుల నియామకంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.వి. ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.

## 10జిల్లాలకు ప్రత్యేక అధికారులు

| | | |
|---|---|---|
| తూర్పుగోదావరి | : | ఎం. సుబ్రహ్మణ్యం |
| పశ్చిమగోదావరి | : | ఎం.కె. మీనా |
| కృష్ణా | : | కరికాలవలవన్ |
| గుంటూరు | : | హీరాలాల్ సమారియా |
| నెల్లూరు | : | అనంతరాము |
| నల్గొండ | : | విజయానంద్ |
| కరీంనగర్ | : | సందీప్‌కుమార్ సుల్తానియా |
| ఖమ్మం | : | వి. ఉషారాణి |
| వరంగల్ | : | శివశంకర్ |
| నిజామాబాద్ | : | ఎల్. ప్రేమచంద్రారెడ్డి |

# ధాన్యం కొనుగోళ్ళకు సర్కారీ షరతులు

- ధాన్యంలో రాళ్ళూ, మట్టిగడ్డలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- పంటలో తప్పతాలు, పొల్లు, చెత్తా చెదారము పోయేట్లుగా బాగా ఎగరపోయాలి. (తూర్పారబట్టాలి)
- ధాన్యంతో తేమ బాగా ఆరేదాకా బస్తాలలో పట్టుబడి చేసి లాటు కట్టకూడదు.
- లాటు కడితే ధాన్యం ముక్కిపోయి, రంగుమారి నాణ్యత కోల్పోయే అవకాశం ఉంటుంది.
- రైతులు వారి ధాన్యం పంట నుంచి సుమారు ఒక కిలోధాన్యం మచ్చు కింద ప్రాథమిక పరిశీలన కోసం ముందుగా కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకువచ్చి నాణ్యాతా పరీక్ష చేసి అధికారికి చూపి తగు సలహాలు పొందాలి.
- అధికారి నుంచి నాణ్యతకు ఆమోదం తెలిపిన తర్వాతే సరుకు కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకురావాలి.
- నాణ్యత పరిశీలనలో ఆమోదం పొందిన ధాన్యంను తరలించేందుకు పౌరసరఫరాల సంస్థ ఖాళీ గోనెసంచులు సరఫరా చేస్తుంది.
- పౌరసరఫరాల సంస్థ (సివిల్ సప్లై కార్పొరేషన్) అందించిన గోనె సంచులలో రైతులు ధాన్యాన్ని నింపి కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకురావాలి.
- రైతులు లేదా కౌలుదారులు పంట పండించిన భూమి సర్వేనెంబరు, విస్తీర్ణము వంటి వివరాలను గ్రామ పంచాయితీ అధికారి నుంచి గుర్తింపు పత్రం తీసుకొని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకురావాలి.

**ఎఫ్ఎక్యు ధాన్య నిర్దిష్ట ప్రమాణాలు**

| వివరాలు | అత్యధిక పరిమిత శాతం |
|---|---|
| ఇతర పదార్థాలు | – |
| ఎ.మట్టి, రాళ్ళు, ఇసుక వంటి వ్యర్థపదార్థాలు | 1.0 శాతం |
| బి. గడ్డి, చెత్త, తాలు, పొట్టు | 1.0 శాతం |
| చెడిపోయిన, రంగుమారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యపుగింజలు | 4.0 శాతం |
| పరిపక్వం కాని, ముడుచుకుపోయిన, వంకర తిరిగిన ధాన్యం గింజలు | 3.0 శాతం |
| తక్కువ శ్రేణి ధాన్యపు గింజలు, లేక కేళీలు (ఎ.గ్రేడు రకం కొనుగోలులో) | 7.0 శాతం |
| తేమ లేక నెమ్ము | 17.0 శాతం |

**రబీ పంట కాలంలో ధాన్యం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) వివరాలు**

| ధాన్యం రకము | కనీస మద్దతు ధర | క్వింటాల్‌కు కనీస మద్దతు ధర 75 కే.జిల బస్తాకు |
|---|---|---|
| సాధారణ రకము | రూ. 1,000 | రూ. 750 |
| ఎ. గ్రేడ్ రకము | రూ. 1,030 | రూ. 772.50 |

## లోక్‌సత్తా టైమ్స్

### 2011, జూన్ 16-30

### విద్యారంగం పై ప్రత్యేక సంచిక

గతంలో ప్రకటించినట్లు కాకుండా 2011, జూన్ 16-30 లోక్‌సత్తాటైమ్స్‌ను విద్యారంగంపై ప్రత్యేక సంచికగా రూపొందిస్తున్నాము. విద్యారంగంపై ఒక సమగ్రమైన అవగాహన కల్పించేందుకు సమగ్రమైన సమాచారంతో ఈ సంచిక వెలువడుతుంది. ఈ ప్రత్యేక సంచికకు జూన్ 10 తేదీలోగా రాష్ట్రంలోని విద్యా సంస్థలు ప్రకటనలు ఇచ్చి సహకరించాల్సిందిగా అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

# మద్దతు ధర బాధ్యత ప్రభుత్వానిదే

**కొత్తపేట :** పాలకులను నిదీసిన రోజునే రైతుకు పూర్తి న్యాయం జరుగుతుందని లోకసత్తా పార్టీ అధినేత జయప్రకాష్‌నారాయణ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో కొత్తపేటలో జరిగిన రైతు సదస్సు జేపీ ప్రసంగించారు. వ్యవసాయ రంగానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంకెళ్లు వేస్తున్నాయన్నారు. కనీసమద్దతు ధర పేరుతో రైతులను ప్రభుత్వం మోసం చేస్తుందని మూడెకరాల కలిగిన రైతుకు ఖర్చులు మాత్రమే వస్తుంటే కౌలు రైతుకు నష్టం వస్తుందన్నారు. వ్యవసాయాన్ని అంతర్జాతీయ మార్కెట్‌లోకి తీసుకుని వెళ్లాలని, దిగుమతి సుంకాలు ఇచ్చి ఉత్పత్తిని పెంచాల్సి ఉందన్నారు. సభలో ఆంధ్రప్రదేశ్ స్వతంత్ర రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్రనాథ్, నాగిరెడ్డి, లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.డి.రామారావు, జడ్పీ ప్రతిపక్ష నేత రెడ్డి రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా రైతుల తలరాతలు మారడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు సమస్యలను ఈ సందర్భంగా జేపీ దృష్టికొచ్చారు. కార్యక్రమంలో జిల్లా సంఘ అధ్యక్షుడు నీరుకొండ శివరామకృష్ణ, కోనసీమ రైతు సంఘ అధ్యక్షులు సలాది వెంకటానందం పాల్గొన్నారు.



## తూర్పు గోదావరిలో జయప్రకాష్ నారాయణ్ రైతు ఉద్యమ యాత్ర

**అంబాజీపేట :** అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్వతంత్ర రైతుసంఘాల నేతృత్వంలో నిర్వహించిన రైతు సదస్సులోనూ ప్రసంగించారు. స్థానిక లోక్‌సత్తా ప్రతినిధి ఉప్పుగంటి భాస్కరరావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

**మండపేట:** జూనియర్ కళాశాలలో జరిగిన రైతు సదస్సులో ఆయన రైతులనుద్దేశించి ప్రసంగించారు. అన్న దాతకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వాలపై విమర్శలు చేశారు. పంట బాగా పండినపుడు రైతుల కళ్లల్లో చిరునవ్వు ఉండాల్సింది పోయి, కన్నీరు వస్తుందని, ఇంతకన్నా దారుణం మరెక్కడా లేదన్నారు. వ్యవసాయాన్ని ప్రభుత్వమే సర్వనాశనం చేసిందని ధ్వజమెత్తారు.

## బీకేయూ నేత తికాయత్ మృతికి లోక్‌సత్తా సంతాపం



రైతునేత, భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) అధ్యక్షుడు మహేంద్రసింగ్ తికాయత్ (76) ఎముకల కేన్సర్‌తో ఆదివారం మరణించారు. ఉత్తర భారతదేశంలో రైతు హక్కుల కోసం తికాయత్ అనేక ఉద్యమాలు నిర్వహించారు. లక్షలాది మంది రైతుల్ని సమీకరించిన నేతగా దేశవ్యాప్త గుర్తింపు పొందారు. తికాయత్ మృతికి లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్ సంతాపాన్ని ప్రకటించారు.

# రైతులు కదిలితే ప్రభుత్వాలు దిగివస్తాయి



మద్దతు ధర కల్పన కోరుతూ చేపట్టిన రైతు చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం ఆయన జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి రైతుల సమస్యలు తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాలను సూచించారు. ఉదయం ఉండ్రాజవరం చేరుకున్న ఆయన అక్కడి రైతులతో సమావేశమయ్యారు. అనంతరం తణుకు మండలం దువ్వలో వివిధ సమస్యలపై చర్చించారు. అనంతరం తాడేపల్లిగూడెం మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడుతూ గిట్టుబాటు ధర కల్పన ప్రభుత్వాల బాధ్యతని, వాటిని సాధించుకోవడం రైతుల చేతుల్లోనే ఉందని గుర్తుచేశారు. అక్కడి నుంచి దెందులూరు మండలం పోతునూరు వెళ్లిన ఆయన ధాన్యానికి మద్దతు ధర ఎంత ఇస్తున్నారు? ప్రస్తుతం రైతులకు ఎకరాకు అవుతున్న ఖర్చును అడిగి తెలుసుకున్నారు. దాదాపు గంటపాటు పోతునూరులో పర్యటించిన ఆయన పెదపాడులో ఇందిరా క్రాంతి పథం రైతుల నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.

## పశ్చిమ గోదావరిలో జయప్రకాష్ నారాయణ్ రైతు ఉద్యమ యాత్ర

**పోరాడి సాధించుకోవాలి:**

రైతు సాగుకు సంబంధించిన తాడేపల్లి గూడెం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే ఈలినాని అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ పంట బాగా పండటంతో రైతులు ఆనందపడ్డారని అయితే ఎగుమతులు లేవన్న కారణంతో మిల్లర్లు చేతులెత్తేయడంతో పండిన ధాన్యాన్ని ఎక్కడ విక్రయించాలో తెలియని సందిగ్ధ పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఒక మండలంలో పండిన పంట మొత్తం సేకరించాలంటే ఎన్ని సంచులు కావాలనే విషయంలో అధికార్ల వద్ద సమాచారం లేని పరిస్థితి నెలకొనడం చాలా బాధాకరమన్నారు. 24 వేల ఎకరాలున్న పెంటపాడులో ఒకే ఒక్క ధాన్యం కొనుగోలు కేంద్ర ఏర్పాటు చేయమేమిటని ప్రశ్నించారు. రైతాంగ సమాఖ్య గౌరవాధ్యక్షుడు మాగంటి సీతారామస్వామి మాట్లాడుతూ పది నెలల నుంచి పోరు పెడుతున్నా ఎఫ్‌సిఐ గోదాములను ఖాళీచేయడం లేదని జేపీ దృష్టికి తీసకొచ్చారు. స్వామినాధన్ కమిటీ సిపార్సులను అమలు చేయాలని డిమాండు చేశారు.

శాశ్వత పరిష్కారం ఆలోచించాలి: రైతులు తాను పండించిన ప్రతిసారీ ధర కోసం ప్రభుత్వాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, దీనిని నివారించాలంటే కచ్చితంగా ధర కోసం దీర్ఘకాలికంగా పోరాడాలని జయప్రకాష్ నారాయణ పిలుపునిచ్చారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉందని, రెండు పంటలకు కలిపి 35 బస్తాలు కౌలు కింద చెల్లిస్తే పెట్టుబడి పోగా కౌలు రైతులు సంకటస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. ప్రస్తుతం దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరిగి వినియోగం తగ్గుతోందన్నారు. దేశంలో 2.12 కోట్ల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వినియోగిస్తుంటే మే మొదటి వారానికి 5.91 కోట్ల మెట్రిక్ టన్నుల ఉత్పత్తియిందని, మరో నెల గడిస్తే 8 కోట్ల మెట్రిక్ టన్నుల ఉత్పత్తికి వెళుతుందన్నారు. వినియోగించగా మిగిలిన ధాన్యాన్ని ఎక్కడైనా అమ్ముకునే వెసులుబాటు కల్పించాలని, అవసరమైతే అంతర్జాతీయ మార్కెట్‌లో ఉత్పత్తులను విక్రయించాలని డిమాండు చేశారు. దేశం మొత్తం రైతులందరికీ దారి చూపించే పశ్చిమగోదావరి రైతులు ముందుండి నడిచి సమస్యల పరిష్కారానికి దారి చూపాలన్నారు. ఈ సందర్భంగా ఒకరైతు జయప్రకాష్ నారాయణ్‌ను కొడవలి బహూకరించారు. కార్యక్రమంలో రైతాంగ సమాఖ్య అధ్యక్షుడు ఏర్నేని నాగేంద్రనాథ్, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు జానకిరామయ్య, మనోరమ రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. ■

యూత్ ఫోరం

నిర్వహణ

కార్తీక్ చంద్ర







**పౌర సమాజంలో ఏ మేరకు యువత పాల్గొంటున్నారు :**

# ప్రజా జీవితంలో యువత పాల్గొంటున్నారా?

స్థానిక సమాజ సేవా కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, గ్రూపులుగా ఏర్పడి చేసుకునే స్థానిక కార్యకలాపాలు ఏవైనాసరే వగైరా... వీటిలో మనదేశ యువత ఇప్పటికీ పరిమితంగానే పాల్గొంటున్నారని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూటిట్ ఆఫ్ పాపులేషన్ సైన్సెస్ (ఐఐపిఎస్, ముంబయి) – పాపులేషన్ కౌన్సిల్ వారు జరిపిన భారత్ యూత్ సర్వే పాలసీ పేపర్ – 2010 బయటపెట్టింది. ప్రత్యేకించి మహిళలు ఇంకా తక్కువ స్థాయిలో పౌర సమాజంలో పాల్గొంటున్నారని ఈ సర్వే రిపోర్టు చెప్తోంది. ఈ సర్వే మనదేశంలోని ఆరు రాష్ట్రాలలో రూరల్, అర్బన్ ప్రాంతాలలో 50,848 మంది యువతీయువకులను 2006 నుండి 2008 సం॥ మధ్య విడతల వారీగా కవర్ చేసింది.

- దేశ యువతలో 48% పురుషులు, 23% స్త్రీలు ఏదో ఒక సమాజ సేవ/ బృంద కార్యక్రమంలో పాల్గొన్నారు. లేదా స్వచ్ఛంద సంస్థలోనో, బృందంలోనో సభ్యత్వం తీసుకున్నారు. లేదా వీటితో అసోసియేట్ అయ్యారు. అదే మన రాష్ట్రంలోని యువతకి వస్తే వీరి సంఖ్య : పురుషులు – 62%, స్త్రీలు – 39%. బీహార్, జార్ఖండ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలతో పోలిస్తే పౌర సమాజంలో పాల్గొంటున్న యువత శాతం ఆంధ్రప్రదేశ్‌లో కొంత మెరుగ్గా ఉన్నది.
- స్థానికంగా ఆరోగ్య – పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం, ఉమ్మడిగా పండుగలు, వేడుకలు, జాతీయోత్సవాలు జరుపుకోవడం, స్వచ్ఛందంగా ఏదో ఒక సేవా కార్యక్రమంలో పాల్గొన్నవారు. (కనీసం ఒక్కసారయినా) :

  దేశయువతలో పురుషులు –45%, స్త్రీలు –15%. ఆంధ్రప్రదేశ్‌లో పురుషులు –59%, స్త్రీలు –17%.
- స్వయం సహాయక బృందాలు, స్వచ్ఛంద సంస్థలు, సమాజ సేవా ఆర్గనైజేషన్లు... వీటిలో సభ్యత్వం తీసుకోవడమో, వీటితో అసోసియేట్ కావడమో చేసినవారు భారతదేశ యువతలో : పురుషులు –11%, స్త్రీలు – 10%. అదే మన రాష్ట్రంలోనైతే పురుషులు –10%,స్త్రీలు –26%.
- అర్బన్ యూత్ కన్నా రూరల్ యూత్ సామూహిక కార్యక్రమాలలో, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో, పౌరసమాజంలో ఎక్కువస్థాయిలో పాలుపంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఊహించినట్లుగానే పెళ్ళయిన వారికన్నా పెళ్ళి కాని యువతీయువకులు ఇటువంటి కార్యక్రమాలలో ఎక్కువస్థాయిలో పాలుపంచుకుంటున్నారు. మొత్తంమీద ఎక్కువ సంవత్సరాలు స్కూలుకెళ్ళినవారు పౌర సమాజంలో ఎక్కువస్థాయిలో పాల్గొంటున్నారు.
- మనదేశంలో సంస్థలు, బృందాల ద్వారా పౌరసమాజంలో స్త్రీల కన్నా పురుషులే ఎక్కువ భాగస్వాములౌవుతున్నారు. కాని మన రాష్ట్రంలో ఈ పరిస్థితి తారుమారుగా ఉంది. (బహుశా మహిళల స్వయం సహాయ బృందాల వల్ల కావచ్చు.)

పౌర సమాజంలో యువత, ముఖ్యంగా 15–24 సం॥ మధ్య మహిళల పాత్ర పెరగాలన్న అవసరాన్ని ఈ సర్వే ఆధారాలతో బయటపెట్టింది. మన యువతని క్రియాశీల పౌరులుగా మలచుకోవాలి. వారిలో కులం, మతం, ప్రాంతం, భాష, లింగం వంటి వాటికి అతీతంగా సామాజిక స్పృహ, విలువలు పెంచాలి. పౌర సమాజంలో వారి పాత్ర, బాధ్యత గణనీయంగా పెరగాలి. ఇందుకోసం స్కూలు, కాలేజీ లేదా ప్రాంతీయ స్థాయిలోని యువత కోసం ప్రత్యేకంగా రూపొందించిన కార్యక్రమాలు, ట్రైనింగ్‌లు చేపట్టాలంటున్నారు సర్వే జరిపిన వారు. ఈ ప్రోగ్రామ్‌లు ఆసక్తికరంగా, క్రియేటివ్‌గా, టెక్స్ట్‌బుక్స్‌కి – క్లాస్‌రూమ్స్‌కి వీలైనంత దూరంగా వుంటే ఫలితాలు వస్తాయంటున్నారు వీరు!

**పౌర సమాజంలో పాల్గొంటున్న ఆంధ్రప్రదేశ్ యువత** *(15-24 సం॥ వారిలో శాతం)*




ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ (ఐఐపిఎస్, ముంబయి) - పాపులేషన్ కౌన్సిల్ వారి

## యూత్ సర్వే ఫలితాల పాలసీ రిపోర్టు 2010

**పౌర సమాజంలో పాల్గొంటున్న దేశ యువత** *(15-24 సం॥ వారిలో శాతం)*






**సివిల్స్ టాపర్ దివ్యదర్శిని**

# జేపీ అడుగుజాడల్లో ...

## అవినీతి మీదే నా పోరాటం..

“నాకు లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ్ అంటే చాలా ఇష్టం. ఆయన అద్భుతమైన వ్యక్తి నాలాంటి వారికి స్ఫూర్తినిస్తున్నారు. ఈ రోజుల్లో సామాజిక స్పృహ కలిగిన అధికారులు చాలా తక్కువ. అలాగే మచ్చలేని రాజకీయనాయకులు చాలా అరుదుగా కనిపిస్తున్నా.. ఈ రెండు లక్షణాలను పుణికిపుచ్చుకున్న అరుదైన వ్యక్తి జయప్రకాష్ నారాయణ్. ఆయన అడుగుజాడల్లో నడవాలనుకుంటున్నాను. ప్రభుత్వ పథకాల్ని ప్రజలకు చేరువ చేయడం నా మొదటి ఆశయం. అర్హులైన వారందరికీ ఫలాలు అందేలా చూస్తాను. గ్రామాల అభివృద్ధి మీద దృష్టి పెడతాను. ఇవన్నీ చేస్తూనే దేశంలో అల్లుకున్న అవినీతిని రూపుమాపేందుకు నడుంబిగిస్తాను. ఇప్పటి యువతీ యువకులు దేశానికి జీవశక్తి. అన్ని రకాల శక్తిసామర్థ్యాలు వాళ్లలో ఉన్నాయి. స్పష్టమైన లక్ష్యం ఉంది. మార్గనిర్దేశం చేసేవాళ్లే తక్కువ. ఆ లోటు సరిచేస్తే యువత గొప్పశక్తిగా ఎదుగుతుంది. ఇలాంటి మార్పు కోసం నా వంతు కృషి తప్పక చేస్తాను...” అంటూ చిన్న వయసులోనే గట్టి సంకల్పాన్ని వినిపిస్తూ.. ఇంటర్వ్యూ ముగించింది దివ్యదర్శిని.

(ఎస్‌కేఎండి గౌస్‌బాషా, నవ్య సౌజన్యంతో...)



# పేరుగొప్ప ఊరు దిబ్బ



**బండారు రామ్మోహన్ రావు**

## మెదక్ జిల్లా లేఖ

ఒకనాటి మొగల్ సామ్రాజ్యంలో మెదక్ గుల్షనాబాద్‌గా పిలవబడింది. నైజాం రాజ్యంలో మెదక్ 'సుభా'గా వుంది. ఏడవ నిజాం మంజీరా నదిపై కట్టించిన ఘనపురం ఆనకట్ట మూలంగా మెదక్ ప్రాంతంలో వరి విస్తృతంగా పండింది. మంజీరా నది పరీవాహక ప్రాంతంలో వుండడం వల్ల మెదక్ 'మెతుకుసీమ'గా విరాజిల్లింది. మెదక్ జిల్లా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 'బారెడు' దూరంలో ఉండి అభివృద్ధికి మాత్రం 'ఆమడ' దూరంలో ఉండిపోయింది. రాజకీయ చారిత్రక విశేషాలు ఎన్నో వున్నా అభివృద్ధికి మాత్రం నోచుకోక పేరు గొప్ప - ఊరు దిబ్బగా మిగిలిపోయింది.






దేశ రాజకీయాల్ని ఒంటిచేత్తో శాసించి ప్రపంచ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న భారత ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ 1980లో మెదక్ నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అంజయ్య జిల్లాలోని రామాయంపేట నియోజకవర్గం నుండి ఎన్నికై ముఖ్యమంత్రిగా పనిచేశారు. నర్సాపూర్ నియోజకవర్గం నుండి ఎక్కువసార్లు ఎన్నికైన బి.సి. నాయకుడు సి. జగన్నాధ రావు ఉపముఖ్యమంత్రిగా కూడా పనిచేశారు. పి.వి.నరసింహ రావు రాజకీయ గురువుగా పేరొందిన పి.వి. రాజేశ్వర్‌రావు సిద్ధిపేట ఎమ్మెల్యేగా పనిచేశారు. ఒకనాటి రాష్ట్ర రాజకీయాల్లో పేరెన్నికగన్న మంత్రులు బాగారెడ్డి, మదన్‌మోహన్, రాజనర్సింహా, రామచంద్రారెడ్డి (స్పీకర్)లతోపాటు నేటి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటూ తెలంగాణ ఉద్యమానికి తలమానికంగా ఉన్న చంద్రశేఖర్‌రావు కూడా ఈ జిల్లా వాసే కావడం గమనార్హం. కాంగ్రెస్‌లో మహిళా నాయకురాళ్ళుగా సమర్ధవంతంగా పనిచేస్తున్న గీతారెడ్డి, సునీతాలక్ష్మా రెడ్డితో పాటు ప్రస్తుతం ఉపముఖ్య మంత్రి రేసులో ముందు న్న దామోదర్ రాజ నర్సింహా ఈ జిల్లా నుండే మంత్రులుగా ఉన్నారు.

**మహిళాచైతన్యం**

గీతారెడ్డి తల్లి ఆనాటి రిపబ్లికన్ పార్టీ జాతీయ నాయకురాలు శ్రీమతి జె. ఈశ్వరీబాయి, జిల్లాలోని ఆందోల్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా 1960వ దశకంలో సేవలు అందించారు. ఆందోల్ నుంచే లక్ష్మిదేవమ్మ కూడా ఎన్నికయ్యారు. మెదక్ నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ తరపున ప్రజలకు అపారమైన సేవలందించి మరణించిన కేవల్ కిషన్ భార్య ఆనందదేవిని మెదక్ ప్రజలు గెలిపించారు. అలాగే రామాయంపేట నియోజకవర్గంలో 60 దశకంలోనే రెడ్డి రత్నమ్మను, టీఆర్ఎస్ పార్టీ నుండి 2004లో పద్మాదేవేందర్ రెడ్డిని గెలిపించారు. గీతారెడ్డి 1989, 2004 గజ్వేల్ నుండి 2009లో జహీరాబాద్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999 నుండి 2004, 2009 ఎన్నికల్లో కూడా ప్రస్తుత మంత్రి సునీతాలక్ష్మారెడ్డి నర్సాపూర్ నియోజకవర్గం నుండి మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించారు. 2009 ఎన్నికల్లో మెదక్ పార్లమెంటుకి సినీనటి విజయశాంతి టీఆర్ఎస్ పార్టీ నుండి ఎంపీగా ఎన్నికయ్యారు. జిల్లా రాజకీయాల్లో మహిళల పాత్రకి మంచి ఉదాహరణగా ఈ మహిళల విజయం చెప్పుకోవచ్చు.

**విభిన్న రాజకీయాలకు పెట్టింది పేరు**

విభిన్న రాజకీయాలకి, సిద్ధాంతపరమైన రాజకీయాలకి

# మెదక్ జిల్లా




## అసెంబ్లీ నియోజకవర్గాలు

1. మెదక్
2. నారాయణ్ ఖేడ్
3. సిద్ధిపేట్
4. దుబ్బాక
5. నర్సాపూర్
6. జహీరాబాద్
7. సంగారెడ్డి
8. పటాన్‌చెరు
9. గజ్వేల్
10. ఆందోల్

నెలవుగా మెదక్ జిల్లా ఉంది. హైదరాబాద్ రాష్ట్రంలో మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికలు 1952లో జరిగినప్పుడు ఆనాటి ముఖ్యమంత్రి పదవికి రేసులో వున్న మాడపాటి హనుమంతరావును ముఖ్యమంత్రి కానీయకుండా కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల వల్ల ఓడించిన ఘనత జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గానికి దక్కింది. అలాగే గజ్వేల్ నియోజకవర్గం నుండే 1962 పోటీ చేసి దొరలు, భూస్వాములను విమర్శించిన నేటి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జి. వెంకటస్వామిని కూడా కాంగ్రెస్ వారే ఓడించారు. సరిహద్దు జిల్లాలైన వరంగల్, నల్గొండ జిల్లాల నుండి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తి వల్ల 1952 ఎన్నికల్లో ఆనాటి ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ తరఫున సిద్ధిపేట నుండి గురువారెడ్డి గజ్వేల్ నుండి పెండెం వాసుదేవ్‌లు ఎన్నిక య్యారు. రాజగోపాల్ పేట అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఆనాటి పీడిఎఫ్ మద్దతుతో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన కె.వి.నారాయణ రెడ్డి గెలుపొందారు. 1952 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రధానంగా పీడిఎఫ్ నుండే సవాళ్ళు ఎదురైనా 1957 ఎన్నికల నుండి వరుసగా 62, 67, 72, 78 ఎన్నికల వరకు కాంగ్రెస్‌కు కంచుకోటగా మెదక్ జిల్లా ఉంది. 1983లో ఎన్టీరామారావు తెలుగుదేశం స్థాపించాక మూడు నాలుగు చోట్ల ఈ కంచుకోటకు గండిపడింది. ఆ తరువాత తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలు జిల్లా రాజకీయాల్లో దోబుచులాట ఆడాయి. 2004 ఎన్నికల వరకు టీఆర్ఎస్ రంగప్రవేశం చేసి జిల్లాలోని 10 సీట్లలో నాలుగు అసెంబ్లీ స్థానాలు, మెదక్ పార్లమెంట్ సీటు గెలిచి కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇచ్చింది.

### సిద్ధిపేట తెలంగాణా ఉద్యమానికి పెద్దపేట

1969లో జై తెలంగాణ ఉద్యమాన్ని వి.వి. మదన్‌మోహన్ సిద్ధిపేట నుండే ప్రారంభించారు. ఆ తరువాత ఆయన సిద్ధిపేట నుండే మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా పనిచేశారు. ఆ తరువాత కాంగ్రెస్ కంచుకోటను బద్దలుచేసి 1985 నుండి నాలుగుసార్లు వరుసగా టీడిపి తరఫున సిద్ధిపేట ఎమ్మెల్యేగా చంద్రశేఖర్‌రావు ఎన్నికయ్యారు. 1985లో తెలుగుదేశం తరఫున మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై కరువుమంత్రిగా ఆరు నెలలు పనిచేశారు. "ఎన్టీఆర్ కాళ్ళు మొక్కను" అన్న పత్రికాప్రకటనకు 1986లో ఆయన మంత్రిపదవి ఊడిపోయింది. 2001లో తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించి ఉద్యమాన్ని ఉధృతం చేశారు. ఆ తరువాత వచ్చిన ఉప ఎన్నికల్లో మళ్ళీ ఆయనే గెలిచారు. 2004లో కరీంనగర్ పార్లమెంటు స్థానంలో పోటీ చేసి గెలిచారు. అప్పటి నుండి కెసిఆర్ మేనల్లుడైన టి. హరీష్‌రావు రాజీనామాల పరంపర వల్ల వచ్చిన ఉప ఎన్నికలతో కలుపుకుని వరుసగా నాలుగుసార్లు సిద్ధిపేట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009 ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీకి పెద్ద దెబ్బే తగిలింది. అంతకుముందు నాలుగు స్థానాలున్న ఆ పార్టీ ఒకే స్థానానికి పరిమితం కావాల్సి వచ్చింది. సంగారెడ్డి ఎమ్మెల్యే టీఆర్ఎస్‌పై తిరుగుబాటు చేసి కాంగ్రెస్‌లో చేరి 2009లో ఎమ్మెల్యేగా గెలిచారు. దుబ్బాక నియోజకవర్గంలో మాజీ మంత్రి తెలుగుదేశం నాయకుడు చెరకు ముత్యంరెడ్డి తెలుగుదేశం నుండి కాంగ్రెస్‌లోకి మారి తెలంగాణ సెంటిమెంటును స్వంతం చేసుకుని ఎమ్మెల్యేగా గెలిచారు. రామాయంపేట నియోజకవర్గం రద్దుకావడంతో ఈ మూడు చోట్ల టీఆర్ఎస్ నష్టపోయింది. చావుతప్పి కన్నులొట్టపోయినట్లు సిద్ధిపేట మాత్రమే టీఆర్ఎస్‌కు మిగిలింది. ప్రస్తుతం జిల్లాలో ఒక టీఆర్ఎస్, ఒక టీడిపి ఎమ్మెల్యే తప్పించి మిగతా 8 సీట్లలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. అధికార పార్టీకి చెందిన 8 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లా సమస్యల పరిష్కారంలో వారి పాత్ర పరిమితంగానే ఉందనే విమర్శ ఉంది. ■

# మున్సిపల్ ఎన్నికలకు ప్రభుత్వ సన్నాహాలు

- **మే16న వార్డుల వారీగా ఓటర్ల జాబితా**
- **29న బీసీ ఓటర్ల గణనకు శ్రీకారం**
- **జూన్ 5 నుండి అభ్యర్థనలు స్వీకారం**
- **26న బీసీ ఓటర్ల తుది జాబితా ప్రకటన**

రాష్ట్రంలోని పాలకవర్గాల పదవీకాలం పూర్తయిన మహానగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగరపంచాయితీల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధం అవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా 85 మునిసిపాలిటీలు, 10 మహానగర పాలక సంస్థల పాలక వర్గం పదవీకాలం గత సెప్టెంబర్‌తో ముగిసిన విషయం తెలసిందే. పాలకవర్గం ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఈ నెల 16న పట్టణ ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం ఎంపీహెచ్ఎస్ డేటా ప్రకారం వార్డు, పోలింగ్ స్టేషన్స్, ఇంటి నెంబర్లతో ఓటర్ల జాబితా విడుదల చేయాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. దీనితోపాటు ఈ నెల 24 నుంచి 28 వరకు బీసీ ఓటర్లను గుర్తించాలని, అలాగే 29 నుంచి వచ్చేనెల 4 వరకు ఇంటింటి సర్వేలో బీసీ ఓటర్లను గుర్తించి 26న వార్డుల వారీగా బీసీ ఓటర్ల జాబితాను ప్రచురణ చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ కార్యదర్శి డాక్టర్ విజయకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

| క్ర.సం | వివరాలు | తేదీ |
|---|---|---|
| 1. | మల్టీపర్పస్ ఇంటింటి సర్వే ప్రకారం వార్డులు, పోలింగ్ స్టేషన్లు, ఇంటినెంబర్ల గుర్తింపు | 16.5.11 నుంచి 23.5.2011 |
| 2. | అసెంబ్లీ ఓటర్ల జాబితా ప్రకారం బీసీ ఓటర్ల గుర్తింపు, వార్డుల వారీగా | 24.5.11 నుంచి 28.5.2011 |
| 3. | బీసీ ఓటర్ల గుర్తింపునకు ఇంటింటి సర్వే నిర్వహణ | 29.5.11 నుంచి 4.6.2011 |
| 4. | ఓటర్ల జాబితాలో మార్కు చేసిన బీసీ ఓటర్ల జాబితా అందుబాటులో | 5.6.11 నుంచి 9.6.2011 |
| 5. | ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన | 10.6.2011 |
| 6. | బీసీ ఓటర్ల జాబితాపై అభ్యర్థన స్వీకరణకు గడువు | 11.6.11 నుంచి 14.6.2011 |
| 7. | అభ్యర్థనలు వార్డుల వారీగా పరిష్కరించేందుకు వెరిఫికేషన్ అధికారులకు శిక్షణ | 15.11.11 నుంచి 16.6.2011 |
| 8. | అభ్యంతరాలపై క్షేత్రస్థాయి పరిశీలన | 17.6.11 నుంచి 21.6. 2011 |
| 9. | వెరిఫికేషన్ అనంతరం ఓటర్ల జాబితాలో బీసీ ఓటర్ల మార్కింగ్ | 22.6.11 నుంచి 25.6.2011 |
| 10. | వార్డుల వారీగా బీసీ ఓటర్ల జాబితా ప్రచురణ | 26.6.2011 |
| 11. | మునిసిపల్ డైరెక్టర్‌కు తుది బీసీ ఓటర్ల జాబితా నివేదన | 27.6.22 నుంచి 29.6.2011 |

## మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం కండి

### పార్టీ శాఖలకు లోక్‌సత్తా పిలుపు

మున్సిపల్ ఎన్నికలకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో లోక్‌సత్తా పార్టీ పట్టణ శాఖలు ఈ క్రింది తక్షణ చర్యలు తీసుకోవాలి.

1. వార్డులవారీగా ప్రకటించే ఓటర్ల జాబితాలో లోటుపాట్లను సరిచేయించుకోవాలి. కొత్తగా ఓటర్లుగా చేరేవారిని ఇప్పటినుండి నమోదు చేయించుకోవాలి.
2. బి.సీ ఓటర్ల జాబితా ప్రకటన ప్రక్రియలో పాలుపంచుకోవాలి. అర్హులైన వారందరూ ఆ జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలి.
3. లోక్‌సత్తా పార్టీ తరఫున పోటీచేసే వార్డులను ముందుగానే ఎంపిక చేసుకోవాలి. ఆ వార్డులలో పార్టీ సభ్యత్వాన్ని చేర్పించాలి. వార్డు శాఖలను ఏర్పాటు చేసి సంస్థాగత ఎన్నికలను నిర్వహించుకోవాలి. ప్రతివార్డు స్థాయిలోనూ శిక్షణాకార్యక్రమం నిర్వహించుకోవాలి.

## ఆస్థిపన్ను పెంపును ప్రతిఘటించండి



ఆస్థి పన్ను పెంపుదలకు వ్యతిరేకంగా అనంతపురంలో ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్

**అనంతపురం :** మున్సిపాల్టీలను అవినీతి కూపాలుగా మార్చి, పౌరసేవల్ని మృగ్యం చేసి పన్నులు పెంచడం పూర్తిగా అనుచితం. కనీస వసతులు కూడా కల్పించ కుండా పన్నులు పెంచడం దారుణం. తక్షణం పెంపును నిలుపుదల చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. పన్నుల పెంపుపై లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నేత ఓంకార్ మాట్లాడుతూ పట్టణాల్లో పన్నులను క్రమబద్ధం చేసి, అవినీతి లేకుండా చెల్లించిన పన్నులకు తగ్గ పౌర సేవలకు అందించే వరకు ఆస్తిపన్ను పెంపును వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్ మాట్లాడుతూ నగరాల్లో కనీస వసతులను కూడా కల్పించని వారికి పన్నులు అడిగే హక్కులేదన్నారు. వాల్మీకి సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు ఓబయ్య మాట్లాడుతూ నగరాలు అధ్వానంగా ఉన్నా పట్టించుకోని అధికారులు పన్నులు ఎలా పెంచుతారని ప్రశ్నించారు. అనంతరం 11 మందితో ఐక్యకార్యాచరణ కమిటీని ఎన్నుకున్నారు. లోక్‌సత్తా నేతలు నాగరాజు, వన్నూరప్ప, నిజాం, సరస్వతమ్మ, ఇస్మాయిల్ బాషా, రాయదుర్గం బాబు, శింగనమ నాగేంద్ర, రోటరీ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, ఏపీటీఎఫ్ ప్రతినిధి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

### జేసీకి లోక్‌సత్తా వినతి పత్రం

**అనంతపురం :** మున్సిపాలిటీలు, కార్పొరేషన్లో పౌరులకు అందాల్సిన సేవలు సక్రమంగా అందడం లేదు. ఎక్కడచూసినా అవినీతి రాజ్యమేలుతొందని లోక్‌సత్తా పార్టీ నాయకులు జేసీకి విన్నవించారు. సోమవారం గ్రీవెన్స డేలో అమెను కలిసి ఆస్తి పన్ను పెంపుపై వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల 117 జీఓను రద్దు చేయాలని, ఆస్తి పన్ను పెంచకూడదని డిమాండుచేశారు. పన్నులు పెంచితే లోక్‌సత్తా ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నేతలు వన్నూరప్ప, నాగరాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పన్నులు కాదు ! పౌరసేవలు పెంచండి
## మున్సిపాలిటీలలో ఉద్యమ సన్నాహాలు

### రాయదుర్గంలో 117 జి.ఓ దగ్ధం

**రాయదుర్గంటౌన్ :** సామన్య ప్రజల నడ్డి విరిచే విధంగా మున్సిపాల్టీల్లో పన్నులు పెంచేందుకు విడుదల చేసిన జీఓ 117ను తక్షణం రద్దు చేయాలని రాయదుర్గం లోక్‌సత్తా పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పురపాలక సంఘం కార్యాలయం ఎదుట లోక్‌సత్తా పార్టీ తాలూకు అధ్యక్షుడు బాబు అధ్వర్యంలో జీఓ ప్రతులను మంగళవారం దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు అబ్దుల్లా, రియాజ్ పాల్గొన్నారు.

# గూడూరులో పన్నుల నిరాకరణ ఉద్యమ కమిటీ



ఆస్థిపన్నుకు వ్యతిరేకంగా గూడూరులో రౌండ్‌టేబుల్

**గూడూరు :** పన్నుల నిరాకరణ ఉద్యమ కమిటీ ద్వారా ప్రజలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నామని ఉద్యమ కమిటీ కన్వీనర్ కె.వి.కృష్ణయ్య అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో బుధవారం లోక్‌సత్తా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆస్తి పన్ను, ఇతర పన్నులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నులు పెంచకుండా వసూళ్ల పరిధిని పెంచి మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలన్నారు. సునీతా సేవా సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు మాట్లాడుతూ పట్టణంలో పన్నులు పెంచే విధానంలో ప్రజల్లో అయోమయం తొలగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సిపీఐ డి.విజన్ కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ మంచినీరు, విద్య, వైద్యసేవల ప్రమాణాలు పెంచడానికి సూక్ష్మప్రణాళికలు ప్రకటించి అమలు చేయా లన్నారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఇస్రాయిల్ కుమార్, ఆరుణో దయ నరసింహా రావు, ఐఎన్‌టీయూసీ చంద్రశేఖర్, మహమ్మదీయ వెల్ఫర్ నెట్‌వర్క్ నాయకుడు అన్వర్‌బాషా, బీఎస్పీ రమణయ్య, ఉల్లిపాయల శంకరయ్య, మునీంద్ర రెడ్డి, బాలాజీరాజు, రవీంద్ర, షబ్బీర్ పాల్గొన్నారు.



## గోనెసంచులు లేని కొనుగోలు కేంద్రాలు

**హుజూర్‌నగర్ రూరల్ :** ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గోనె సంచులు సర్ఫరా చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని లోక్‌సత్తా పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జీ కడియం శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఆదివారం మండలంలోని బూరగడ్డ ఐకేపీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లో కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు.

## 'ఆస్తి పన్ను పెంపుపై ఉద్యమిస్తాం'

**నరసాపురం టౌన్ :** మునిసిపాలిటీలో ఆస్తి పన్ను పెంపు నిర్ణయానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని స్థానిక భవానీ నర్సింగ్ హోమ్‌లో గురువారం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్ణయించింది. ఈ సందర్భం గా పార్టీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ ఎస్.నాగభూషణం మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్రైయినేజీలు, వీధి లైట్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. మునిసిపల్ అధికారులు ఆస్తి పన్నును భారీగా పెంచడానికి నిర్ణయించడం దారుణమన్నారు. ఆస్తి పన్నుపెంపు నిర్ణయంపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సమావేశంలో తీర్మానించి, ఇందుకోసం రూపొందించిన కరపత్రాలను విడుదల చేశారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు మల్లుల వెంకటేశ్వరరావు, నల్లం సూర్యచంద్రరావు, పులఖండం వెంకటేశ్వరరావు, కేసరి సుబ్బరాజు, కిషోర్ పాల్గొన్నారు. ■



రాయదుర్గంలో ఆస్తిపన్ను జి.ఓ. దగ్ధం



అనంతపురంలో జే.సి. కి మెమోరాండం



ఆస్తిపన్నుపై గూడూరు
మున్సిపల్ కమీషనర్‌కు మెమోరాండం



ఖమ్మం విద్యార్థి సత్తా సమావేశం



RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12



ఖమ్మం జిల్లా ఏన్కూర్ మార్కెట్ యార్డులో రైతులతో
డా॥ జయప్రకాష్ నారాయణ్

To,

Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**
H.No. 5-10-180/A&A1,
Band Lanes, Hill Fort Road,
Hyderabad- 500 004.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad